వార్త
ఆదివారం
27 నవంబరు, 2022

# నోట్ల మాయలో ఓటరు!



# ధనుశ్ తాజా చిత్రం 'సార్'



తారాతీరం

ధనుశ్ తమిళం లో వరుస సినిమాలు చేస్తూ వెళుతున్నాడు. ఒక ఇమేజ్ చట్రంలో చిక్కుకోకుండా విభిన్నమైన, విలక్షణమైన పాత్రలను చేస్తున్నాడు. తెలుగు, తమిళ భాషల్లో ఆయన ఒక సినిమా చేస్తున్నాడు. ఆ సినిమా పేరు 'సార్'. తమిళంలో దీనికి 'వాతి' అనే టైటిల్ ఫిక్స్ చేశారు. వైవిధ్యభరితమైన కథా కథనాలతో ఈ సినిమా రూపొందుతోంది. ఫిబ్రవరి 17వ తేదీన ఈ సినిమాను విడుదల చేస్తున్నట్లు చెబుతూ కొత్త పోస్టర్‌ను వదిలారు.

ఈ సినిమాలో లెక్చరర్ పాత్ర పోషిస్తున్నప్పటికీ, విద్యా వ్యవస్థలోని సంస్కరణల దిశగా ఈ చిత్ర కథ ఉండనున్నట్లు తెలుస్తోంది.

ఈ చిత్రానికి వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్నాడు. ఇంతవరకు ఆయన నుంచి ప్రేమ కథా చిత్రాలే వచ్చాయి. కానీ మొదటిసారిగా ఆయన తన స్టైల్‌కి భిన్నమైన కథను తీసుకుని వస్తున్నాడు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతాన్ని సమకూర్చుతున్న ఈ సినిమాలో కథానాయికగా సంయుక్త మీనన్ అలరించనుంది. సితార బ్యానర్‌తో త్రివిక్రమ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

# విశ్వక్సేన్ స్వీయ దర్శకత్వంలో హీరోగా..

విశ్వక్సేన్ ఎప్పటికప్పుడు వైవిధ్యమైన సినిమాలతో ప్రేక్షకులను మెప్పిస్తున్నాడు. హీరోగానే కాకుండా దర్శకుడిగా తన ప్రతిభను చాటుకు న్నాడు. 'ఫలక్‌నుమా దాస్' చిత్రంతో తనలోని దర్శకుడిని పరిచయం చేసిన విశ్వక్ ఇప్పుడు మరోసారి మెగా ఫోన్ పట్టుకున్నాడు. తన స్వీయ దర్శకత్వంలో హీరోగా నటిస్తున్న చిత్రం 'ధమ్కీ'. ఈ చిత్రంలో తన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విశ్వక్ సోషల్ మీడియాలో రిలీజ్ చేశాడు. మాస్, క్లాస్ కలగలిసిన లుక్‌లో ఆకట్టుకుంటున్నాడు.

'హెచ్చరికలు లేవు ధమ్కీ మాత్రమే' అనే క్యాప్షన్‌తో విశ్వక్ ఈ పోస్టర్‌ని రిలీజ్ చేశాడు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. పాన్ ఇండియా కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో నివేదా పేతురాజ్ హీరోయిన్‌గా నటిస్తోంది. రావు రమేశ్, పృథ్వీరాజ్, హైపర్ ఆది ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. లియోన్ జేమ్స్ మ్యూజిక్ అందిస్తున్న ఈ చిత్రాన్ని వన్మయి క్రియేషన్స్, విశ్వక్సేన్ సినిమాస్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. తెలుగుతో పాటు తమిళం, మళయాళం, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రానికి ప్రసన్నకుమార్ బెజవాడ కథ అందించారు.



ఆదివారం వార్త
sunmagvaartha@gmail.com
27 నవంబరు, 2022

## మంచి ముత్యాలు

మగువ, మధువు తరుచుగా రాజ్యపతనానికి కారకులయ్యాయి. అయితే, పుస్తకాల మూలంగా చెడిపోయిన వారినెవరినైనా చూచారా?

\- చైనా కథ నుండి

## విషయ విశేషం

ఆకట్టుకునే బుట్టల నగలు... 4
'సంఘీ'భావం....5
ప్రమాదంలో పర్యావరణం
అతిపెద్ద జలపాతం ఇగ్వాజు...6
కవర్ స్టోరీ..8
నోట్ల మాయలో ఓటరు!
ఈవారం కవిత్వం..12
ద్వైధీ
'నీ జన్మ సార్థకమైంది'...14
పార్థుడు పాశుపతాస్త్రం పొందిన...18
కథ.. 20
ఒకే మాట
సాహిత్యం.. 23
సద్గురు త్యాగరాజ కీర్తనా దివ్యత్వం
వర్తమానం మన చేతుల్లో..26
మనసున్న మనిషి... 30
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
సరదాగా కాసేపు..
వగైరా..వగైరా..




# తాజా వార్తలు


## వయోజనులకు 'మొబైల్ పాఠశాల'

నీలమ్ వాళ్ల నాన్న ఆ రోజు తన మిత్రుడి ఇంటికి కార్లో వెళుతున్నాడు. మధ్యలో నీలమ్‌కి ఫోన్ చేసి "నా ఫ్రెండ్ గూగుల్ మ్యాప్ లింక్ పంపాడమ్మా. దాన్ని ఎలా వాడాలో తెలియట్లేదు, అర్థగంట నుంచి ఇక్కడే తిరుగుతున్నాం" అన్నాడు. దాన్ని ఎలా వాడాలో వివరించి ఆయన్ని గమ్యం చేర్చడానికి పావుగంట పట్టిందట నీలమ్‌కి. ఆ అనుభవం తనని ఆలోచనలో పడేసింది. ప్రస్తుతం అరవై దాటిన ఎంతో మంది దగ్గర స్మార్ట్ ఫోన్స్ ఉన్నా వాటిని ఎలా వాడాలో వాళ్లకి తెలియడం లేదు. సైబర్ నేరగాళ్లూ వీళ్లని చాలాసార్లు లక్ష్యంగా చేసుకుంటున్నారు. 'అలాంటి వాళ్లకి స్మార్ట్ ఫోన్ వాడకాన్ని నేర్పిస్తే ఎలా ఉంటుంది?' అన్న ఆలోచన వచ్చింది నీలమ్‌కి. తన ఆలోచనను స్నేహితురాలు పింకీతో పంచుకుంది. ఇద్దరూ కలిసి 'మొబైల్ పాఠశాల' పేరుతో కోల్‌కతాలో ఓ స్కూల్ ప్రారంభించారు. కొద్ది నెలల్లోనే నాలుగు బ్యాచ్‌ల్లో వంద మంది రావడం మొదలుపెట్టారు. కానీ కరోనా లాక్‌డౌన్‌తో ఆ పాఠశాల ఆగిపోయింది. దాంతో ఆన్‌లైన్ మార్గం ఎంచుకున్నారు. ఇందుకోసం అతి సులువైన ఆప్‌ని రూపొందించారు. వాట్సాప్‌లో డీపీ పెట్టడం, ఫొటోకి ఎఫెక్ట్ ఇచ్చి షేర్ చేయడం దగ్గర్నుంచి మొబైల్ బ్యాంకుల నిర్వహణ దాకా సమస్తం ఇందులో నేర్పిస్తున్నారు వీళ్లిద్దరు. ఈ మధ్యే దేశం నలుమూలల నుంచి ఐదు వేల మంది సబ్‌స్క్రైబర్‌ల మైలురాయిని దాటింది వీళ్ల 'మొబైల్ పాఠశాల' ఆప్.

### చవకలో ఆధునిక రోడ్లు

ప్రతాప్ భీమసేన రావు అమెరికాలోని హార్వర్డ్‌లో పీహెచ్‌డి చేసాడు. కంప్యూటర్లు తయారుచేసే హెచ్‌పీ సంస్థలో వైస్ ప్రెసిడెంటుగా బెంగళూరు వచ్చాడు. అక్కడో రోజు వాళ్ల ఫ్రెండ్ కూతురు అరుంధతి స్కూటర్ ప్రమాదంలో చనిపోయింది. రోడ్డు మీద గుంతల కారణంగానే తను ప్రమాదానికి గురైందని తేలింది. అప్పటి నుంచి రహదారి గుంతల్ని పూడ్చడం మొదలుపెట్టాడు ప్రతాప్. వెయ్యి రోడ్లని అలా సమూలంగా మార్చిన అతణ్ణి 'పాట్‌హోల్ రాజా' అని పిలవడం మొదలుపెట్టారు బెంగళూరు వాస్తవ్యులు. ఆ పేరుతోనే స్నేహితుడు సౌరభ్‌కుమార్‌తో కలిసి సోషల్ స్టార్టప్‌ని ప్రారంభించాడు ప్రతాప్. విదేశీ టెక్నాలజీ స్ఫూర్తితో కేవలం పదిహేను నిమిషాల్లో రోడ్డుమీది గుంతల్ని పూడ్చే సరికొత్త యంత్రాల్ని డిజైన్ చూశారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో 'గ్రిడ్‌మ్యాట్స్' అనే పొడవైన ప్లాస్టిక్ షీట్లని కనిపెట్టి దానికి పేటెంట్ కూడా తీసుకున్నారు.














# ఆకట్టుకునే బుట్టల నగలు

దుస్తుల్లోని ఫ్యాషన్ల మాదిరిగానే నగల్లోనూ ఈ మధ్య రోజుకో కొత్త డిజైన్ పుట్టుకొస్తోంది. ఉత్తరాదిన ముత్యాలు, రత్నాలు, అన్‌కట్ వజ్రాలతో చేసే కుందన్‌కారి, పోల్కీ నగల్లో దక్షిణాది టెంపుల్ డిజైన్లు కనిపిస్తున్నాయి. ఇప్పుడు వాటికి చిన్న చిన్న బుట్టల్ని వేలాడదీస్తున్నారు. నగల్లో మాదిరిగానే బుట్టల్లోనూ, నక్షీ, టెంపుల్, తుషి.. ఇలా బోలెడు రకాల డిజైన్లు వస్తున్నాయి.

ఆయా నగలోని డిజైన్‌ని బట్టి దానికి వేలాడే బుట్టనీ చక్కగా జత చేస్తున్నారు. అన్నింట్లోకి పచ్చలూ కెంపులూ వంటి రాళ్లతో చేసిన చిన్న సైజు బుట్టలైతే నెక్లెసులు, హారాల్లోని లాకెట్లకీ చక్కగా ఒదిగిపోతున్నాయి. వాటిని చూసి ఇప్పుడు దక్షిణాది నగల డిజైనర్లు సైతం ఈ బుట్టల లాకెట్లని భారీ హారాలకీ, కంఠె నెక్లెసులకీ సైతం అమరుస్తున్నారు.





'సంఘీ' భావం



# ప్రమాదంలో పర్యావరణం

మారుతున్న జీవన విధానాలు పర్యావరణాన్ని ప్రమాదంలోకి నెట్టివేస్తున్నాయి. పెరుగుతున్న పట్టణ, నాగరీకత వ్యవస్థ, అడవుల విధ్వంసం, పెరుగుతున్న కాలుష్యం, అటవీభూముల ఆక్రమణలు వంటి అనేక విషయాలు పర్యావరణానికి నష్టాన్ని చేకూరుస్తున్నాయి. దీని ప్రభావం వల్ల కొన్ని సంవత్సరాలకు మానవుల మనుగడే ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా అటవీ ప్రాంతాలు గణనీయంగా తగ్గుముఖం పడుతున్నాయి. రహదారులు అటవీ ప్రాంతాల మీదుగా నిర్మించడం, మైదాన ప్రాంతాల నుంచి రాజకీయ వత్తిడితో అటవీ భూముల ఆక్రమణలు వేగవంతంగా జరుగుతున్నాయి. మరోపక్క పోడు వ్యవసాయం మరింతగా నష్టం కలిగిస్తోంది. ఆదివాసీలకు అండగా ఉంటామని కొందరు స్వార్థపరులు ఉద్యమాలు చేసి ఆ భూములను కాజేసే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎవరు అధికారంలోకి వస్తే వారు సాధ్యమైనంత వరకు భూముల ఆక్రమణలపై దృష్టిసారిస్తున్నారు. దీనివల్ల ఒక పక్క అటవీ ప్రాంతాల విస్తీర్ణం తగ్గుముఖం పట్టడంతో ఈ ప్రాంతాల్లో నివసించే అమాయలకులైన ఆదివాసీలు, గిరిజనుల జీవనం దుర్భరంగా మారుతోంది. మరోపక్క పర్యావరణం దెబ్బతినడంతో అసహజ వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయి. గత రెండు దశాబ్దాలుగా వాతావరణ పరిస్థితిని సమీక్షిస్తే మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇప్పుడిప్పుడే ప్రారంభ దశలో ఉన్న ఈ పరిస్థితులను కట్టడి చేయకపోతే ఈ శతాబ్దం అంతానికి మానవాళి ప్రశాంతంగా నివసించే పరిస్థితులు ఉండబోవని శాస్త్రజ్ఞులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గత రెండేళ్లుగా పరిశీలిస్తే విపత్తులు ఏ విధంగా దేశాన్ని ఇబ్బందిపెడుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ప్రతిఏటా రికార్డు స్థాయిలో వరదలు, తుఫాన్లు చుట్టుముడుతున్నాయి. దీనితో లక్షలాది ఎకరాల్లో పంటలు దెబ్బతింటున్నాయి. వేలాది మంది ప్రజలు, పశువులు మృత్యువాత పడుతున్నారు. ఈ సంవత్సరంలో కోనసీమ జిల్లాలో కురిసిన వర్షాలు తాము ఎన్నడూ చూడలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలకు లంక గ్రామాలు ముంపునకు గురికావడం తమకు సాధారణ విషయమే గాని ఈసారి వరుసగా మూడుసార్లు కుండపోత వర్షాలు, వరదలు రావడం నెల రోజులకు పైగా తాము ఇళ్లను వదిలి పునరావాస కేంద్రాల్లో తలదాచుకోవడం మాత్రం ఇదే మొదటిసారి అని వారు చెబుతున్నారు. వాతావరణ శాఖ లెక్కల ప్రకారం ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు సుమారు 242 భీతావహ ప్రకృతి వైపరీత్యాలు వచ్చాయి. అమెరికా, చైనా తరువాత అత్యధికంగా విపత్తులు ఎదుర్కొన్న దేశంగా భారత్ మూడో స్థానంలో ఉంది. గత రెండు దశాబ్దాల్లో మన దేశంలో విపత్తుల కారణంగా వంద కోట్ల మంది ప్రజలు దుర్భర పరిస్థితులను ఎదుర్కొన్నారు. దాదాపు 90 వేల మంది ప్రాణాలు కోల్పోయారు, దాదాపు 13 లక్షల కోట్ల మేర నష్టం జరిగింది. ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా భారీ నష్టం కలిగింది. నదీపరీవాహక ప్రాంతాల్లో వరదలు తీవ్రమయ్యాయి. సముద్రం కొన్ని వందల కిలోమీటర్లు చొచ్చుకువచ్చి భూభాగాన్ని చుట్టుముట్టింది. హైదరాబాద్‌లో గత సంవత్సరంలో కురిసిన రికార్డుస్థాయి వర్షాలకు అనేక కాలనీలు జలమయం అయ్యాయి. రోడ్లు ధ్వంసం అయ్యాయి. మూసీ నది సైతం తన ఉగ్రరూపాన్ని ప్రదర్శించింది. వందేళ్లలో మూసీ ఈ మేరకు ప్రవహించలేదని స్థానికులు చెబుతున్నారు. హైదరాబాద్‌తో పాటు చెన్నయ్, బెంగళూరు, ముంబయి నగరాలు సైతం ఈసారి భారీ వర్షాలను చవిచూశాయి. విద్యాసంస్థలు సైతం మూసి వేయాల్సిన పరిస్థితి నెలకొంది. గత రెండు దశాబ్దాలతో పోలిస్తే ఈసారి పరిధికి మించి వర్షాలు నమోదు అయ్యాయి. నగరాల్లో చెట్ల పెంపకం గణనీయంగా తగ్గిపోయింది. కాంక్రీట్ జంగిల్‌గా నగరాలు మారిపోతున్నాయి. ప్రతి సంవత్సరం కురుస్తున్న వర్షాలు పెరుగుతూ వస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని రిజర్వాయర్లు వర్షాకాలం పూర్తి అయితేనే కాని నిండేవి కావు. కొన్ని 80 శాతం మాత్రమే నిండేవి. అయితే ఈసారి అందుకు భిన్నమైన వాతావరణం నెలకొంది. జూన్‌లో కురిసిన వర్షాలకే రిజర్వాయర్లు నిండిపోయాయి. దీనితో మళ్లీ మూడు దఫాలుగా వర్షాలు కురవడంతో వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు వదిలారు. దీనివల్ల అనేక లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వేలాది క్యూసెక్కుల నీరు సముద్రంలో కలిసింది. భద్రాచలం వంటి నగరానికి సైతం వరద ముప్పు వాటిల్లింది. ఎన్నడూ లేని విధంగా నీరు తమ ప్రాంతాలకు చేరిందిన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వాతావరణ శాస్త్రజ్ఞులు పేర్కొంటున్న ప్రకారం రాబోయే సంవత్సరాల్లో ఇంతకంటే హెచ్చువర్ష పాతం ఉంటుందని సమాచారం. ఈ పరిస్థితులు రావడానికి కేవలం పర్యాపరణ సమతుల్యత దెబ్బతినడమేనని వారు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు, ప్రజలు వాస్తవ పరిస్థితులు గ్రహించకపోతే మరిన్ని సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంది. సామాజిక అడవులు పెంపుదలలో మరింత కృషి అవసరం. ఇళ్లలో చెట్ల పెంపకం తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలి. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ఈ నిబంధన ఉన్నా పట్టించుకోవడం లేదు. రోడ్ల విస్తరణ,బహుళ అంతస్తుల నిర్మాణం పేరుతో నిత్యం వేలాది చెట్లను నరికివేస్తున్నారు. ఓట్ల రాజకీయంతో ముడిపెట్టి ఆక్రమణలను పట్టించుకోవడం లేదు. కొందరు అధికారులు కూడా అవినీతికి పాల్పడుతూ ఆక్రమణలను పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వంలోను, ప్రజల్లోను పర్యావరణం పట్ల చైతన్యం వస్తేనే భావితరాలు విపత్తుల నుంచి విముక్తి పొందే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

ఇగ్వాజు జలపాతం ప్రాంతంలో నివసించే వారిని ఇండియన్స్ ఇది మేఘాలు జన్మించే ప్రాంతం అని భావించి చనిపోయిన తమ బంధువులను పూడ్చిపెడతారు. మూడు దేశాల సరిహద్దులు కలవడంతో ఇక్కడ నిర్మించిన వసతి గృహాలు పర్యాటకులతో కిక్కిరిసిపోయి సందడిగా ఉంటుంది. ఈ ప్రాంతంలో పలురకాల రంగులలో సీతాకోక చిలుకలు కనువిందు చేస్తాయి. ఎత్తు నుండి ఇగ్వాజు జలపాతం తిలకించాలంటే అర్జెంటీనా వైపు నుండి చాలా బాగుంటుందని కొందరి అభిప్రాయం. అర్జెంటీనా వైపు నుండి జలపాతం దూరంగా విహంగ వీక్షణంలో కనిపించడం వల్ల హోరు తక్కువగా వినిపిస్తుంది. ఇగ్వాజు జలపాతాన్ని బ్రెజిల్ వైపు నుండి తిలకించడం అనేది అత్యుత్తమ వీక్షణం అని అనేకమది పర్యాటకులు భావిస్తారు. ఇగ్వాజును స్పానిష్ భాషలో స్థానికులు 'కాటరాక్ట్ డెల్ ఇగ్వాజు' అని, పోర్చుగీసు లో 'కాటరాక్ట్ ధూ అయ్ ఇగ్వాజు' అని పిలుస్తుంటారు. బ్రెజిల్ నుండి అతి చేరువగా ఇగ్వాజు జలపాతాన్ని వీక్షించ వచ్చు. లాంచీలో సైతం ఇగ్వాజు జలపాతాన్ని చేరువగా వెళ్లి తిలకించే సౌకర్యం ఉంది. జలపాతం అంచున నిర్మించిన వంతెన అంచుపై నుండి నడుస్తూ నీటిని తాకగలిగినంత సమీపం నుండి ఇగ్వాజు జలపాతం తిలకించవచ్చు. ఇంత చేరువగా ఇతర జలపాతాన్ని తిలకించలేమంటే అతిశయోక్తి కాదు. బ్రెజిల్ వైపు హెలికాప్టర్‌లో విహరిస్తూ ఈ జలపాతాన్ని విహంగ వీక్షణం చేయవచ్చు. అయితే అర్జెంటీనా వైపు పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని హెలికాప్టర్ సౌకర్యం నిషేధించారు. అమెరికా మాజీ ప్రథమ మహిళ ఎలియనోరో రూజ్‌వెల్ట్ ఇగ్వాజు జలపాతాన్ని చూసి ఆశ్చర్యచకితురాలై 'పూర్ నయాగరా' అని బిగ్గరగా అరిచినట్లు ఇక్కడి చరిత్ర చెబుతుంది. ఇగ్వాజు జలపాతం నయాగర జలపాతం కంటే ఎంతో పెద్దది అనేది ఆమె భావాల వల్ల సునాయాసంగా అర్థం చేసుకోవచ్చు.





**యునెస్కో వారసత్వ గుర్తింపు**

ఇగ్వాజు జలపాతాన్ని యునెస్కోవారు ప్రపంచ వారసత్వ ప్రదేశంగా ప్రకటించారు. ఇగ్వాజు జాతీయ ఉద్యానవనం పేరుతో అర్జెంటీనా వైపు ఒక జాతీయ ఉద్యానవనం ఉండగా, బ్రెజిల్ వైపున మరో జాతీయ ఉద్యానవనం ఉంది. ఈ రెండు జాతీయ ఉద్యానవనాలను కూడా యునెస్కోవారు ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపునిచ్చారు. ఈ ఉద్యానవనాలలో రెండు వేల వృక్షజాతులు, 400 పక్షిజాతులు ఉన్నాయని అంచనా. పరాగ్వే-బ్రెజిల్ సంయుక్తంగా 'ఇటాయిపు' పేరుతో భారీ జలవిద్యుత్ ప్లాంట్‌ను జలపాతం వద్ద నిర్మించారు. అటు అర్జెంటీనా, ఇటు బ్రెజిల్ దేశాల విద్యుత్ అవసరాలు దాదాపు 40 శాతం వరకు ఈ ప్లాంట్ వల్ల తీరుతున్నాయి. అర్జెంటీనా, బ్రెజిల్ రెండు నగరాలలో విమానాశ్రయాలు ఉన్నాయి. జాతీయ ఉద్యానవనాలు సందర్శించాలన్నా, ఇగ్వాజు జలపాతాన్ని సందర్శించాలన్నా ప్రత్యేకమైన రుసుము చెల్లించాల్సి ఉంటుంది. బ్రెజిల్ వైపు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు; అర్జెంటీనా వైపు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు ఈ జలపాతాన్ని తిలకించే సమయాలుగా నిర్ధారించారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది పర్యాటకులు ప్రపంచ వ్యాపంగా వచ్చి ఇగ్వాజు జలపాతాన్ని తిలకించి ఉల్లాసభరితంగా గడిపి వెళుతుంటారు. ❑







# నోట్ల మాయలో ఓటరు!

కవర్ స్టోరీ

ఎం.వెంకటేశ్వరరావు

**ఎన్నికలంటే చాలు.. సామాన్య ఓటరుకి తాత్కాలిక పండగ. రాజకీయ పార్టీలకు, నేతలకు దీర్ఘకాల పండగ. ఓటు విలువ ఐదేళ్లంటే ఒక్కసారి కష్టపడి రాజకీయ రంగ ప్రవేశం చేస్తే చాలు కొన్ని తరాల పాటు సెటిలై పోవచ్చనే విషయం గ్రహించిన రాజకీయ నేతలు ఎన్నికల్లో అరచేతికి ఎముకల్లేని అపర దాన కర్ణుల అవతారం ఎత్తుతున్నారు.**

ఎన్నికల ప్రణాళికలతో, ప్రచారం పేరుతో ఎలాంటి వికృత క్రీడలకైనా సిద్ధమవుతున్నారు. పూర్వం ఎన్నికలంటే విధానాల ప్రాతిపదికన జరిగేవి. అధికారంలోకి వస్తే ఏం చెయ్యబోతున్నదీ చెప్పేవారు, చేసేవారు. జాతీయ వాదంతో కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించేది.

నేడు ప్రాంతీయ పార్టీలు పెరిగిపోయాయి. జాతీయ పార్టీలు జాతీయ వాదాన్ని పక్కకు నెట్టి ఏ ఎండకా గొడుకు పడుతూ అధికారం కోసం ప్రాంతీయ వాదానికి వెన్నుదన్నుగా జాతీయ పార్టీలు కాపుకాస్తున్నాయి.

విలువలతో కూడిన రాజకీయాలకు విలువలు ఊడదీసి, సభ్య భాషకు తిలోదకాలిచ్చి, వినలేని భాషతో, కనలేని అకృత్యాల వికృత రాజకీయ క్రీడ ఇవ్వాళ రాజ్యమేలుతోంది.

**ఓటు వాక్కు**

భారతదేశంలో పౌరులందరికీ రాజ్యాంగం కల్పించిన ఆయుధం ఓటు హక్కు. తమ ప్రతినిధిగా, తమకు నచ్చిన వ్యక్తిని ప్రతినిధిగా ఎంపిక చేసుకొనేందుకు ఎన్నికల ప్రక్రియను రాజ్యాంగంలో పొందుపరచారు.

ఒకప్పుడు రాజకీయాల్లో విలువలతో కూడిన రాజకీయ నాయకులుండేవారు. గాంధీ, నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి వంటి విలువలు, వ్యక్తిత్వాలే నాయకత్వ లక్షణాలుగా భావించేవారు. పదవిని తృణప్రాయంగా భావించిన నాయకులు ఏలిన రాజకీయాల్లో అరాచకీయాలు అరంగేట్రం చేశాయి. బురద నుండి కమలం పుట్టినట్టు అడపాదడపా అబ్దుల్‌కలాం వంటి నీతిమంతులు కన్పించినా కుళ్లి పోయిన రాజకీయాల్లో ఇమడలేకపోతున్నారు. ఇవ్వాళ్టికీ దిశానిర్దేశం చెయ్యగల, విద్యార్హత ఉన్న రాజకీయ మేధావులున్నా 'ఓటరు' వారికి అవకాశం ఇవ్వకపోగా కనీసం డిపాజిట్లు కూడా దక్కనివ్వటం లేదు. మేధావులు మౌనం వహించడంతో కనీసార్హత, అవగాహన లేని అరాచక శక్తుల రాజకీయాలను ధనార్జనకు, అధికార వేదికలుగా మార్చుకున్నాయి.

సామాన్య ఓటరుని ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికలతో ప్రలోభపెట్టడానికి కావాల్సిన ప్రలోభ ప్రణాళికలు సిద్ధం చేసుకుని వజ్రాయుధం లాంటి ఓటుని సామాన్యుడి దగ్గర నుండి సునాయాసంగా లాక్కోవడానికి హద్దు, పద్దు లేని సాధ్యాసాధ్యాలు ఆలోచింపనీయకుండా వాగ్దానాల వెల్లువ కురిపిస్తున్నాయి.

పేదవాడి ఓటు కోసం ఎర వేయడానికి 'నోటు'ను ఆనందంలో ఓలలాడించడానికి 'మద్యాన్ని' పప్పు బెల్లాల్లా పంచిపెడుతున్నాయి. సామాన్య ఓటరు ఎన్నిసార్లు మోసపోయినా ఐదేళ్ల గడిచాక అంతా మరిచి పోతున్నాడు.

ఓటరును హామీలతో ఆకట్టుకోవడానికి కాదేదీ వాగ్దానాల కనర్హం అన్నట్టు తమ స్థాయి దిగజారి విదూషకుల అవతారమెత్తుతున్నారు. పవిత్రమైన ఎన్నికలని భ్రష్టు పట్టిస్తున్నారు. ఇందుకు జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలతో పోటీ పడుతున్నాయి.

పదవిలో ఉన్నప్పుడు కాలకృత్యాలకు కూడా ఖరీదైన ఫ్లైట్లను ఉపయోగించే స్థాయిలో వున్న నేతలు, ఎన్నికల ముందు పాదయాత్రల పేరుతో పకడ్బం దీగా ఊదరగొట్టుడు ఉపన్యాసాలతో ప్రజలను మభ్యపెట్టి ప్రతిపక్షాలని అసభ్య పదజాలంతో తిడుతూ ప్రజలతో ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్నారు. దృష్టి సారినంత భూకబ్జాలకు పథక రచన చేసుకుంటున్నారు.

దివిలో ఉండే తారలు భువికి దిగివచ్చినట్టు ప్రజలతో మమేకమైపోయి, సహపంక్తి భోజనాలు, సరిగంగ స్నానాలు, వాటికి సొంత మీడియా కవరేజీలతో సకల కలలను ప్రదర్శిస్తు న్నారు. ఓటర్లని గొర్రెల మందలుగా మార్చి, ప్రలోభాల మత్తు జల్లి ఒకదాని తర్వాత ఒకటి ఆలోచనారహితంగా బావిలో దూకే గొర్రెలుగా చేసి పబ్బం గడుపుకుని పదవుల్లో చేరిపోతున్నారు. ఆ తర్వాత ప్రజల వైపుగానీ, వాళ్ల సమస్యల వైపు కన్నెత్తి చూడరు. ప్రశ్నిస్తే హత్యలు చెయ్యడానికి కూడా వెనుకాడని (అ) రాజకీయాలు, విముక్తి లేని రాజకీయాలు నేడు నెలకొన్నాయి.

**ఎన్నికల హామీలు**

ఎన్నికలు కేంద్రంలోనైనా, రాష్ట్రాల్లోనైనా, ఆఖరుకి ఉప ఎన్నికైనా అటు కేంద్రంలో ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ఎన్నికల హామీలతో ఓటర్లకు అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నాయి. ప్రభుత్వాలు ఆ తాయిలాలు అమలు విషయంలో క్లారిటీతో ఉన్న సామాన్య ఓటరు మాత్రం ఎప్పుడూ ఎప్పట్లాగే మాయాజాల నేతల మాటలకు మోసపోతూనే ఉన్నాడు. అమలు సాధ్యంగాని హామీలతో మధ్య తరగతి, కింది తరగతి ఓటర్లకు పట్టపగలే ఆకాశంలో నక్షత్రాలు చూపెడుతున్నారు. అన్ని వర్గాలను ఆకట్టుకునేలా మేనిఫెస్టోలు విడుదల చేస్తున్నాయి. రాజకీయ పార్టీలు, నేతలు పోటీపడి వరాలిస్తున్నాయి.

➡ యువతకు పది లక్షల ఉద్యోగాలు, మూడు వేల రూపాయల నిరుద్యోగ భృతి

➡ 500లకే గ్యాస్ సిలిండర్

➡ 300 యూనిట్ల వరకూ ఫ్రీ కరెంటు

➡ 3 లక్షల వరకూ రుణ మాఫీ వంటివే కాకుండా

➡ కరోనాతో చనిపోయిన కుటుంబాలకు 4 లక్షల వరకూ ఆర్థిక సహాయం

➡ కె.జి టూ పి.జి వరకూ ఉచిత విద్య

➡ పాత పెన్షన్ విధానం

➡ రూ. పది లక్షల వరకూ ఉచిత వైద్యం

➡ 25 ఏళ్లలో జరిగిన అవినీతిని బయట పెట్టి దోషులను శిక్షిస్తాం

➡ ఫీజు రీ అంబ్రాసిమెంటు;

➡ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు; సెల్‌ఫోన్లు

➡ మహిళలకు గ్రైండర్లు, మిక్సీలు, పసుపు-కుంకుమ, పట్టుచీరెలు, గ్రాము బంగారం...

అన్ని రాష్ట్రాల్లో ఇదే తంతు. ఎన్నికలొస్తే ఓటరుకి పండుగ. నేతలు వరాల జల్లులు కురిపించటంలో పోటీ, కార్ల రేసుతో





పోటీ పడుతున్నాయి.

ఆలోచించిన ఆశాభంగం.. రావాలి, రావాలి.. అన్నట్టు ప్రవర్తిస్తున్నాయి రాజకీయ పార్టీలు. నువ్వొకటి ఉచితం అంటే రెండు నా వంతు అన్నట్టుంటున్నాయి. ప్రత్యక్ష పార్టీలు, నేతలు కురిపిస్తున్న హామీల వర్షంలో తడిసిముద్దవుతున్నాడు ఓటరు. ఐదేళ్ల ఎదురుచూపుకు ఎన్నికల హామీలు, ఓటరును కన్నబిడ్డల కంటే ఎక్కువగా చూసుకుంటున్నారు నేతలు. ఓటరు కన్పిస్తే చాలు.. ఆప్యాయత ఏరులై పారుతుంది. ధవళ వస్త్రాలు ధరించిన రాజకీయ నేత (అ) సహజ నటనా చాతుర్యం, వాళ్లని ఎంతటి పన్లకైనా సిద్ధపడేలా చేస్తున్నాయి. కరచాలనాలు, కౌగిలింతలు, ఆశీర్వచనాలు, ముద్దులు.. ఒకటేమిటి.. రక్త సంబంధీకుల్ని, కన్నబిడ్డల్ని ప్రేమించడం కంటే మించిపోతున్నాయి. పల్లెటూళ్లలో పూరిళ్లలో సహపంక్తి భోజనాలు, టీ, కాఫీలు తాగటంతో ఆగకుండా, టీ తయారు చెయ్యటం, దోశలు, ఇడ్లీలు చెయ్యటం, ఇస్త్రీ చెయ్యటం లాంటి ఎన్నడూ చెయ్యని పన్లు చేస్తూ ఓటరుని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నారు.

తమిళనాడులో ఎలక్షన్ హామీలు ఎప్పటికప్పుడు కాలానుగుణంగా కొత్త పుంతలు తొక్కుతూనే ఉంటాయి. పెట్రోలు ధరలు తగ్గిస్తాం, 2 లక్షల ఉద్యోగాలిస్తాం.. అని ఒకరంటే-వాషింగ్ మెషీన్లు, సోలార్ స్టవ్‌లు ఉచితం.. అని మరొకరు చెప్తారు. తమిళనాడు ఎన్నికలంటేనే ఉచిత హామీల జాతర. కామరాజర్ నుండి కరుణానిధి, జయలలిత వరకు ఉచిత హామీల మోత మోగుతూనే ఉంది. 40 ఏళ్ల తర్వాత కరుణానిధి, జయలలిత లేకుండా జరిగిన గత ఎన్నికల్లో కూడా ఉచితాల ఊదర సామాన్య ఓటరుని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

పొలిటికల్ పార్టీల వ్యూహ, ప్రతివ్యూహాలు ఉచితాల్లో నువ్వా? నేనా? అన్నట్టు పోటీ పడుతున్నాయి. ఒక పార్టీ లీటరు పెట్రోలుపై 5 రూపాయలు, డీజిల్‌పై 4 రూపాయలు తగ్గిస్తామని; మహిళలకు సిటీ బస్సుల్లో ఉచిత ప్రయాణం; గ్యాసు సిలిండరుకు 100 రూ. సబ్సిడీ, రేషన్ కార్డుండే కరోనా బాధితులకు 4 వేల సాయం, ఏడాది పాటు ప్రసూతి సెలవులు వంటి 500 హామీలు మేనిఫెస్టోలో పొందుపరిచి భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి అక్కడ విజన్ డాక్యుమెంటు విడుదల చేసిందో పార్టీ. అంతే కాకుండా పంటధరలు, సాగు చట్టాలపై వందల హామీలు గుప్పించారు. రాష్ట్రంలోని అన్ని పరిశ్రమల్లో 75 శాతం సొంత రాష్ట్రాలకే చెందిన నిరుద్యోగులకు అవకాశం.

దివంగత ముఖ్యమంత్రి పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా 500 భోజనశాలలు ఏర్పాటు, వృద్ధాప్య పింఛను పెంపు, 50 ఏళ్ల దాటిన అవివాహిత మహిళలు, దివ్యాం యగ మహిళలకు పెన్షను. వరికి మద్దతు ధర, జల్లికట్టు ఎద్దులను పెంచేందుకు రుణాలివ్వడం; పాఠశాల విద్యార్థులకు పాలు ఉచితం, విద్యార్థినులకు శానిటరీ నేప్‌కిన్లు ఉచిత పంపిణీ; మహిళా రిజర్వేషన్ల పెంపు; ప్రసూతి మహిళలకు ఆర్థిక సాయం, స్కూల్స్, కాలేజీ విద్యార్థులకు ఉచిత డేటాతో పాటు ల్యాప్‌టాపులు ఉచితం. నిరుద్యోగ భృతి ఇలాంటివి ఎన్నెన్నో.

మిగతా రాష్ట్రాల్లో మేమేం తక్కువ కాదంటూ నవరత్నాలు, రైతులకు వడ్డీ లేని రుణాలు, పిల్లల్ని స్కూలుకి పంపే తల్లిదండ్రులకు ఆర్థిక సాయం, దేశంలో ఎక్కడ వైద్యం చేయించుకున్నా ఆరోగ్యశ్రీ వర్తింపు; వడ్డీ లేని రుణాలు; పంట వేసే ముందే మద్దతు ధర; ఇళ్లు లేని పేదలకు పక్కా ఇళ్లు, ఉద్యోగాల భర్తీ క్యాలెండర్; ఇలాంటివే కాకుండా ఎవరూ ఊహించని తాయిలాలు ఎన్నెన్నో. ప్రతి రేషన్ కార్డుదారుడికి వాషింగ్ మెషీన్ సాధ్యమేనా?

రేషన్‌కార్డుదారులకు నెలకి రూ.1500/-లు, 6 గ్యాస్ సిలిండర్లు ఉచితం అని ఒకరంటే- పోటీ పడి ఆచరణ సాధ్యంగాని హామీలు గుప్పిస్తున్నారు. అవి అమలు చెయ్యాలంటే ఖజానా మీద మోయలేని ఆర్థిక భారం పడుతుంది. హద్దు లేకుండా వరాల జల్లులు కురిపించి తీరా అధికారంలోకి వచ్చాక ఆర్థిక లోటు చూపుతూ అప్పుల ఊబి లోకి రాష్ట్రాన్ని పీకల లోతు వరకూ దింపేస్తున్నారు. అప్పులు చేసి మరీ హామీలు అమలు చేస్తున్నారు. ఉచితా లకు అలవాటు పడ్డ ఓటర్లు, యువత సోమరులుగా తయారవుతున్నారు. రాజకీయ నేతలు ఉచిత హామీలనేవి ఎప్పుడూ సక్సెస్ ఫార్ములాగా భావిస్తున్నారు.ఒక్క దక్షిణాది రాష్ట్రాలనే కాదు.. అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి.

ఆల్ ఫ్రీ పొలిటిక్స్‌తో జనాల్లోని కష్టపడే తత్వాన్ని నిర్వీర్యపరుస్తున్నారు. ప్రయోజనకరమైన పథకాల్లో కిలో రెండు రూపాయల పథకం, ఓ ప్రాంతీయ పార్టీకి అధికారంలోకి తెచ్చింది. ఉచిత హామీల ఉప్పెనలో ఓటర్లు కొట్టుకుపోయేలా చేస్తున్నారు. సామాన్య ఓటరుకి ఉచిత హామీలన్నీ అమలౌతాయా? లేదా? అనే అనుమానం రాకుండా తమ మాటల మాజాజాలంతో అనుమానపు ఆలోచన రాకుండా ఉన్న చోటు కదలకుండా సప్త సముద్రాలు దాటిస్తున్నారు.

**ఎన్నికలలో అభ్యర్థి ఎంత ఖర్చు చెయ్యాలి?**

ఎలక్షన్ కమిషన్ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ప్రచారం, సభలకుగాను ఖర్చు పెట్టే వ్యయానికి పరిమితులు నిర్ణయించింది. పంజాబ్, ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రాలలో ఎమ్మెల్యేగా పోటీ చేసే వ్యక్తి తమ ఎన్నికల ప్రచారానికి రూ.40 లక్షల వరకు ఖర్చు చెయ్యొచ్చని, గోవా, మణిపూర్ వంటి చిన్న రాష్ట్రాల్లో ఎన్నికల ఖర్చు 28



లక్షల వరకు ఉండొచ్చని ప్రకటించింది. 2014లో ఈ పరిమితిని సడలిస్తూ పెద్ద రాష్ట్రాల్లో 95 లక్షలు, చిన్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 75 లక్షల వరకు అనుమతించింది.

1952లో మొదటి సాధారణ ఎన్నికల్లో అభ్యర్థులు 25,000-35,000 వరకు వెచ్చించవచ్చని నిబంధనలున్నాయి.

**అత్యంత ఖరీదైన ఎన్నికలు**

తెలంగాణలో హుజూరాబాద్, మునుగోడులో జరిగిన ఉప ఎన్నికలు అత్యంత ఖరీదైన ఎన్నికలుగా ప్రాచుర్యం పొందాయి.

హుజూరాబాద్ ఉప ఎన్నికలో పరువు కోసం పాకులాడుతూ వందల కోట్లు ఖర్చు చేశాయి. పలు పార్టీలు పరస్పరం దూషించుకున్నాయి.

**మునుగోడు**

ఇటీవల జరిగిన ఉప ఎన్నికలో రెండు




ప్రధాన పార్టీలు 500 కోట్లకు పైగా ఖర్చు చేశాయని, మూడో స్థానంలో నిలిచిన జాతీయ పార్టీ అభ్యర్థి ఆరోపించారు. ఒక పార్టీ సుమారు 250 కోట్లు ఖర్చు చేయగా; మూడో ప్రధాన పార్టీ 150 కోట్లు ఖర్చు చేసినట్టు భోగట్టా. ఇక ఖర్చులకు భయపడ్డ మరో పార్టీ కూడా 30-40 కోట్ల మధ్య ఖర్చు చేసినట్టు సమాచారం.

నిజంగా ఇన్ని కోట్లు ఖర్చయ్యాయా? ఈ లెక్కలు గమనిస్తే అయ్యే ఉంటుందని అనుకోవచ్చు. ఒక పార్టీ మునుగోడు నియోజక వర్గంలో మొత్తం 2 లక్షల మంది ఓటర్లకు నగదు పంచినట్టు ఆరోపణలున్నాయి. ఒక్కో ఓటరుకు తొలుత 3 వేల చొప్పున, తిరిగి పోలింగ్ రోజున మరో 1000 రూపాయలు పంచిందని స్థానికులు చెబుతున్నారు. ఇంకా కొందరికి మొదట నగదు పంచిన సమయంలోనే 10 గ్రాముల వెండి నాణాలు, ఒక చీరె కూడా పంచిందట. అంతేకాకుండా ప్రతి కులానికి ఆత్మీయ సమ్మేళనం పేరుతో పిలిచి మాంసాహార భోజనాలు, రూ.500/- పంచిందట. ఇవన్నీ బహిరంగ రహస్యాలే. ఈ దావతులను హైదరాబాదు శివార్లలో కూడా నిర్వహించారు.

మరో పార్టీ దాదాపు 150 కోట్లు ఖర్చు చేసిందని చర్చించుకుంటున్నారు. పార్టీ కూడా భారీగా నిధులు సమకూర్చిందని, వాటికి తోడు అభ్యర్థి కూడా సొంతంగా విచ్చలవిడిగా ఖర్చు చేశారని ప్రచారం జరుగుతోంది.

వీటికి తోడు మునుగోడు నియోజక వర్గంలో కనీసం 50 కోట్ల రూపాయలు విలువ చేసే మద్యం పంపిణీ అయినట్టు సమాచారం. అంతేకాకుండా ప్రాంతాలవారీ ఇన్‌ఛార్జిలు పార్టీ అధిష్ఠానంతో మాట వస్తుందని

ఉదంతాలున్నాయి.
వలసలకు ప్రత్యేక ప్యాకేజీ
పైకి కన్పించని ఎన్నికల వ్యయం మరొకటి ఉంది. జంప్ జిలానీలకు(వలస) అరికట్టేందుకు, ఇతర పార్టీల నుండి వలసలను ఆకర్షించేందుకు కూడా పార్టీలు భారీగా ఖర్చు చేశాయి. పరువు కోసం పార్టీలు కోట్ల రూపాయలు మంచినీళ్లలా ఖర్చు పెడుతున్నాయి. ఓటర్లకు హామీల ప్రలోభాలు పెట్టడం మొదలయ్యాక వారి ఆశలు కూడా ద్రవ్యోల్బణంలా నానాటికి పెరిగిపోతున్నాయి.

**ఒరిగిందేమిటి?**

ఒక్కసారి ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థి ఖర్చు పెట్టిన కోట్లు తిరిగి ఎలా సంపాదించాలన్న ఆలోచనలలోనే ఉంటున్నాడు. పదవి వచ్చాక ఒక్కసారి కూడా నియోజక వర్గాన్ని కానీ, ప్రజలనుగానీ పట్టించుకోవడం మానేస్తున్నారు. ఓటు వేసిన పాపానికి శాపగ్రస్తుల్లా కనీసం అవసరాలకి అవస్థలు పడుతున్నారు. తాగునీటి సమస్య, రోడ్ల సమస్య, విద్యుత్ సమస్య, అనారోగ్య సమస్యలు, విద్యా సమస్య, వైద్య సమస్యలు.. ఇలా చెప్పుకుంటూ పోతే కోకొల్లలు.

మళ్లీ ఐదేళ్ల తర్వాత దర్శనమిచ్చే పాత మొహాలే కొత్త హామీలతో వాళ్లుగానీ వాళ్ల వారసులుగానీ ఎలక్షన్ల బరిలో ఎలక్షన్ కమిషన్ నిబంధనలలోని లోపాల్ని కొత్త కొత్త మోసపూరిత హామీలతో.. వైవిధ్యభరిత నటనతో ఓటుకు నోటు, మద్యం, మాంసాహారం, అమలుకు వీలుకాని హామీలతో పవిత్రమైన 'ఓటు' కోసం యాచక అవతారమెత్తుతున్నారు.

**రాబోయే రోజుల్లో..**

➡ కులాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు.. అక్కడ మందు, మాంసాహార విందు, వచ్చిన వారికి నగదు పంపిణీ.

➡ నామినేషన్ రోజునే నగదు పంపిణీ.

➡ ప్రచారంలో భాగంగా భారీ బహిరంగ సభలు, రోడ్ షోలు, పార్టీ అగ్ర నేతలతో మీటింగుల ఖర్చు.

–➡ వలసలను అరికట్టేందుకు భారీ ప్యాకేజీల ఖర్చు.

➡ ప్రచార సామాగ్రి, పోలింగ్ బూత్‌ల ఇన్‌ఛార్జిలకు, ప్రకటనలకు వ్యయం.

➡ సోషల్ మాధ్యమాలు, యు–ట్యూబ్ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం.. కాదేదీ ప్రచారానికి అనర్హంటూ వాటి కోసం కోట్ల ఖర్చు.

➡ సామాన్య ఓటరును లొంగదీసుకునే మద్యం, బిర్యానీ విందుల వ్యయం.

➡ ఓటర్లకు నగదు పంపిణీ.

➡ పోటీ తీవ్రంగా ఉంటే చీరెలు, వెండి, బంగారం.. ఇతర ఖరీదైన వస్తువుల పంపిణీ.

➡ బహిరంగ సభలకు భారీగా జనం తరలింపు ఖర్చు.





ఇలా ప్రతి నియోజక వర్గంలో సగటున 200 కోట్లు ఖర్చు చెయ్యాల్సి వస్తోంది. క్షణ క్షణానికి ఆకాశాన్నంటుతున్న ధరల ప్రభావం ఎక్కువగా ఉన్నందున ఎన్నికల ఖర్చు మితిమీరుతోంది. ఊహించనంత భారీగా, జూదంగా మారబోతోంది. నియోజక వర్గాల్లో అత్యంత ధనికులైన అభ్యర్థులు, రాజకీయ వారసులు బరిలో ఉంటారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వర్గాలు, పెద్ద పెద్ద విద్యా సంస్థల అధినేతలు, బడా పారిశ్రామికవేత్తలు, సినీ నటులు ఎన్నికల బరిలో ఉంటున్నారు.

**ఓటరులో మార్పు రావాలి**

నేడు ప్రపంచంలో ఏ మూల ఏం జరిగినా క్షణాల్లో ఏ మారుమూల గ్రామానికైనా అందించే మాధ్యమాలు వచ్చేశాయి. ఎన్నికలపుడు రాజకీయ నేతలు, పార్టీలు ఇచ్చే హామీలు, చేసే వాగ్దానాలు ఎంతవరకు ఆచరణ యోగ్యమైనవని ఆలోచించాలి. సామాన్యుడి మనుగడకు కావలసిన తాగునీరు, ఆహారం, విద్య, వైద్యం, రోడ్లు, రవాణా, ఉపాధి, పంట గిట్టుబాటు ధర వంటి ఎన్నో సమస్యలను దూరంగా నెట్టి ప్రలోభాలకు గురి చేస్తున్న హామీలను నమ్మకూడదు. అలా చెప్పేవారిని తరిమికొట్టాలి. కనీసం కార్పొరేటర్‌గా పని చేయని వ్యక్తులకు శాసించే పదవుల్లో అనాలోచితంగా ఓటుహక్కుతో కూర్చోబెట్టటం వాస్తవ విరుద్ధమని గ్రహించాలి.

సంక్షేమం పేరుతో పౌర సమాజాన్ని నిర్వీర్యం చేస్తున్న నేతలకు బుద్ధి చెప్పాలి. బాధ్యతా రహిత సమాజాన్ని పోటీపడి సృష్టిస్తున్న సంక్షేమ పథకాలకు 'నో' చెప్పాలి.

ప్రజలను మద్యానికి బానిసలు చేసి, దాని మీద వచ్చే ఆదాయంతో సంక్షేమం పేరిట మోసగిస్తున్న పార్టీలకు బుద్ధి చెప్పండి.

మద్యపానం నిషేధం చెయ్యాలనీ, విద్య, వైద్యం ఉచితంగా ఇవ్వాలని నేతలను నిలదీయండి. ఓటరు మారితేనే వ్యవస్థ మారుతుంది. ❏





## ఈ వారం కవిత్వం

# ద్వైధీ

**పల్లె,** పట్నం
రెండూ అతనిలోనే
అమాయకత్వం, గడసరితనం
ఒకే వొరలో రెండు కత్తులు
సంఘర్షణ బహు కష్టం!
ఒకటి ప్రశాంత చేతన
రెండోది అల్లకల్లోల సృజన
ఒకటి నది
రెండోది సముద్రం

పల్లె మనసును వీడదు
పట్నంలో శ్వాస ఆడదు
క్రమంగా ఒక్కో మెట్టే ఎక్కుతూ
నింగి లాంటి ఒంటరితనంలోకి.
ఒకప్పుడు
పల్లె పట్నం వైపు పారే యేరు
ఇప్పుడు పట్నం
గండి పడి పల్లెలను ముంచేస్తున్న తీరు.
శ్రమ మిశ్రమమయ్యింది.

భ్రమ నిత్య దృశ్యమయ్యింది
స్పష్టత లేని వేదాంతం
సూర్యుడు రాని నిశాంతం.
ఇంత పెద్ద రోడ్లూ
ఒంటరితనానికి దార్లయ్యాయి
ఆశ్చర్యం!
పల్లెలో మనసు నిండుగా
నెనరు పండువగా వుండేది.
పల్లెల అందాలన్నీ
ఇక జ్ఞాపకాల్లోనే
కొండొకచో
సెలవుల నెలవులుగానే.
పల్లెను పూర్తిగా వదల్లేక
పట్నంలో ఇమడలేక
తనలోకి తాను
కుంచించుకుపోయే మనిషితనం.

ఈ శబ్దాలు
శతాబ్దాల నాటివి,
అర్థాలు మాత్రం
కొత్తగా గమ్మత్తుగా.
నడకలో
కాళ్ళు తడబడుతున్నాయి
ఇది నేటి చరిత్ర.

**- డా॥ ఎన్.గోపి**

---



## హైకూలు

నిన్ను చూసింది
ఒక్క క్షణం
తపిస్తున్నా అనుక్షణం.
నీ జ్ఞాపకాల్లో
నా కలలు ఈదుతూ
నిన్ను మరువలేక.
చీకటిలో
వెతుకుతున్నా/ వెలుగులా వస్తావని.
నీ జ్ఞాపకాలు/ సునామీ
చిక్కి బతగ్గలనా!

**- కాయల నాగేంద్ర**

---

# రైతుకష్టం

**తె**లుసుకోరా తెలుగుబిడ్డ తెలిపిచూడు రైతు ఘనత
దేనితోనూ సాటిరాని రైతుకష్టం తెలుసుకోరా..
అందమైన పల్లెలోనా
స్వచ్ఛమైన మట్టిలోన, స్వార్థమేమి లేని గుండె
వేకువైనా, వెన్నెలైనా పంటతోనే చెలిమి చేసే
పైరుగాలి పలకరించే, సేద్యమేతన ఊపిరాయే
భూమిలోన నారు నాటి నింగిపైకి ఆశతోనే
చినుకుకోసం ఎదురు చూసే..
నింగిలోన చినుకు జారి పసిడిపంట తాకగానే
ఆశలన్నీ చివురు తొడిగి, రైతుమనసు మురిసిపోయి
సంబరంతో చిందులేసే
వానలైనా వరదలైనా, నిద్రలేపే పసిడి పంటే
అమ్మవోలే పంట కొలిచి, కాలమంతా సాగు చేసి
లోకమంతా కడుపు నింపే
పండగైనా పబ్బమైనా, పంటలోనే పసిడి చూసి
పంట చేతికి రాకపోయిా దుఃఖమంతా గుండెలోనే,
ఆశలన్నీ కరిగిపోయే అవసరాలు ఆగిపోయే..
పెద్ద పెద్ద చదువులోనా రైతు ఊసే లేకపోయినా
కష్టమైనా నష్టమైనా కాసులేమి రాకపోయినా
చేనులోనే బతుకు సాగే.

**- రాజా విరియాల**



## ఆలోచనలను ప్రభావితం చేసే కథలు



డా॥బి.జి.రమేష్ ఆంగ్లంలో రచించిన బెడ్‌టైమ్ స్టోరీస్‌కు ఒద్దిరాజు మురళీధర్ రావు చేసిన తెలుగు అనువాదం 'పాడేపక్షులు'. ఇందులో మొత్తం 25 కథలున్నాయి. ఈ కథలన్నీ ఏదో ఒక సామాజికాంశం ఆధారంగా బాలలకు నీతిని, నిజాయితీని, మంచి తనాన్ని, సత్ప్రవర్తనను బోధించి వారి ఆలోచనలను ప్రభావితం చేసేవిధంగా ఉన్నాయి. నిజానికి అనువాదకుడు కథలను మక్కికి మక్కిగా అనువదించ కుండా, వాక్యాలలోని భావాన్ని గ్రహించి, దానిని అనువదించడం ప్రశంసనీయం. బెడ్‌టైమ్ స్టోరీస్‌ను 'పాడేపక్షులు'గా మార్చటం వల్ల అనువాదాలకి మూలంలో భావం చెడకుండా, స్వతంత్ర అస్తిత్వాన్ని ఆపాదించినట్టయింది. దాంతో కథలు చదువుతుంటే, అనువాద కథలు చదువుతున్న భావన కలగదు. చక్కటి కథలు గల ఈ పుస్తకం పిల్లలతోపాటు పెద్దలను కూడా ఆనందింపచేస్తుంది. సత్ప్రవర్తనను నేర్పి, మంచి ఆలోచనలు పంచాలనుకున్న వారు ఈ పుస్తకాన్ని పిల్లలకు, పెద్దలకు బహుమతిగా ఇవ్వవచ్చు. నవల రచయితకు, అనువాదకుడికి అభినందనలు.

**(పాడే పక్షులు, (బాలల అనువాద కథలు), మూలం: డా॥బి.డి.రమేష్, అనువాదం: ఒద్దిరాజు మురళీధరరావు)**

**- నిర్మోహి**

## డా॥ముక్తేవి భారతి సమీక్షా వ్యాసాలు



వంశీ ఆర్ట్ థియేటర్స్ స్వర్ణోత్సవ ప్రచురణగా ఈ పుస్తకం వెలువరించారు. 1960 సం॥ నుండి తెలుగు సాహితీ రంగంలో కృషి చేస్తున్న డా॥ ముక్తేవి భారతి కథలు, వ్యాసాలు, జీవిత చరిత్రలు, అనేక టి.వి. రేడియో కార్యక్రమాలు, ప్రసంగాలు చేసిన గొప్ప సాహితీవేత్త. ఈ పుస్తకంలో డా॥ ముక్తేవి భారతి పౌరాణిక నవలల గురించి ఎన్.వి.హనుమంతరావు, శీర్షికలు-రచనలు గురించి డా॥ సి.మృణాళిని, జీవిత చరిత్రలు గురించి డా॥ సి.భవానీదేవి, వ్యాసాలపై డా॥ వెలుదండ నిత్యానందరావు, కథలపై.. ఆచార్య ఫణీంద్ర అసమాన కథయిత్రి అంటూ డా॥ గురజాడ శోభ చక్కటి విశ్లేషణాత్మక, పరిశోధనాత్మక వ్యాసాలు రాశారు. వీరి కథల్లో మానవీయ కోణమూ, మాతృత్వ భావమూ, స్నేహించే ధోరణి, కుటుంబ విలువలు, ఆదర్శ దాంపత్య జీవనం, పర్యావరణ పరిరక్షణ లాంటి అంశాలు బలంగా చెప్పారని డా॥ గురజాడ శోభ తన వ్యాసంలో పేర్కొన్నారు. లక్ష్మణరావుతో కలిసి భారతీ రచించిన 'భారతంలో ప్రేమ కథలు' అంశంపై ఆచార్య ఫణీంద్ర చక్కటి విశ్లేషణ రాసారు. శర్మిష్ఠ-దేవయానిల కథ బాగుంది. మన సంస్కృతి అర్థం చేసుకోవాలంటే మన సాహిత్యం బాగా అధ్యయనం చేయాలి. అందుకు వక్తగా, ప్రవక్తగా భారతి సాహిత్యం ఎంతగానో ఉపకరిస్తుంది. ఓ మంచి సాహిత్య విశ్లేషణా వ్యాసాల సంపుటి అందించిన సంస్థకు అభినందనలు. **(డా॥ ముక్తేవి భారతి రచనలు, సంకలన కర్తలు: డా॥ తెన్నేటిసుధాదేవి, జ్యోతివలబోజు; పేజీలు: 60; వెల: రూ. 100/-లు, ప్రతులకు: వంశీ ఆర్ట్ థియేటర్స్, 2-1-527/5,నల్లకుంట, హైదరాబాద్)** **- తంగిరాల చక్రవర్తి**

# పుస్తక సమీక్ష

## అంబేద్కర్ జీవితం, సిద్ధాంతాల పరిచయం


భారతరత్న డా॥.బి.ఆర్.అంబేద్కర్ (14-4-1891) జీవితచరిత్ర ఎన్నిసార్లు, ఎవరు చెప్పినా మళ్లీమళ్లీ వినాలనిపిస్తుంది. ఆ జీవిత చరిత్రలో పోరాటం ఉంది. త్యాగం ఉంది. సాహసం ఉన్న మానవతావాది. ఆయనది సత్యనిష్టగల జీవితం. ఇంతటి మహనీయుడి ఆదర్శవంతమైన జీవితాన్ని రాయటానికి



మరో మహనీయుడు పూనుకున్నారు. సప్తతిలో అడుగు పెట్టనున్న పద్మారావు కొన్నాళ్లుగా అంబేద్కర్‌ను చదువుతున్నారు. ఎన్నో వ్యాసాలు అంబేద్కర్ గ్రంథాలకు ముందుమాట రాసారు. ఇప్పుడు తానే స్వయంగా అంబేద్కర్ గూర్చి రాయాలన్న సత్సంకల్పానికి పూనుకుని కలం/గళం విప్పారు. మూడు భాగాలుగా పూనుకుని వెలువరించిన మొదటి భాగం ఇది. 628 పేజీలు 19 అధ్యాయాలు మొదటి భాగంలో ఉన్నాయి. అంబేద్కర్ జననానికి ముందు మహారాష్ట్ర స్థితిగతులు, మూలవంశీయుల యెడ ప్రదర్శించబడిన వివక్ష, తల్లిదండ్రులు, వారి పిల్లలు ఎదుర్కొన్న కష్టాలు పేదరికం, విద్యాభ్యాసం, ఆనాడు బ్రాహ్మణులు కనబర్చిన కులాధిపత్యవాదన, ఆయనపై బౌద్ధమతం చూపిన ప్రభావం వివరించబడింది గ్రంథంలో. 1913లో తండ్రి మరణం, విదేశీయానం వరకు ఈ భాగంలో ఇవ్వబడింది. వయోజనులు కూడా సౌకర్యంగా చదువుకోవటానికి అనువైన ఫాంట్‌సైజ్, ముఖ్యమైన సంగతులకు బ్రాకెట్ కట్టి ఇచ్చారు. **(అంబేద్కర్ జీవిత చరిత్ర మొదటిభాగం, రచన: డా॥కత్తి పద్మారావు, వెల: రూ 600, ప్రతులకు: అన్ని ప్రముఖ బుక్‌హౌస్)** **- కూర చిదంబరం**

ఓటు విలువను తెలియజేస్తూ, ఓటరు బాధ్యతను గుర్తుచేస్తూ కవయిత్రి సోని కట్కూరి 'తర్కం' వినిపిస్తున్నారు. నిజమైన ప్రజాస్వామ్య ప్రాశస్త్యాన్ని వివరిస్తూ తార్కికంగా (లాజికల్) ముప్పయి కవితలల్లారు. 'వ్యాపారం మొదలెట్టినోళ్లు/ సేవకులెందుకైతరు?/

## ఓటు విలువ ఓటరు బాధ్యత



సావును అలవాటు చేసే మాంత్రికులైతరు' నోటును ఎరవేసి ఓటును కొనుక్కునే స్వార్థపరులు నాయకులు కాలేరని కవయిత్రి భావం. 'దేశాన్ని ఎంతకమ్ముతే మాకేంది/ రాష్ట్రాన్ని ఎవడెంత దోచుకుంటే మాకేంది/ ఊరని ఎవడూడ్చుకపోతే మాకేందని' నిర్లప్తత వహించే ఓటర్లు ఒవిధంగా సమాజద్రోహులే!

'ఫ్రీగా ఇచ్చే అన్నింటిని/ ఆనందంగా అనుభవించేటోడిని/ నాకెందుకులే అనుకునే/ నా ఇంట్ల మన్ను వద్దన్నాడు..?' ఓటు హక్కు సక్రమంగా వినియోగించుకోకపోతే నష్టపోయేది..నాశనమయ్యేదీ సమాజమే! దేశంలో మెజారిటీ ప్రజలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలందరు సమైక్యం కావాలని న్యాయంగా వారికి దక్కాల్సిన రాజ్యాధికారం వారే దక్కించుకోవాలనీ పిలుపునిస్తున్నారు సోనీ. ముఖ్యంగా మహిళల్లో చైతన్యం రావాలి. 'నిస్సహాయత ననుభవించే/ ప్రతి మహిళ ఓటరే చైతన్యాన్ని తేవాలి' యిదీ కవయిత్రి ఆశ. యిలాంటి ప్రబోధాత్మక సాహిత్యం నేటి సమాజానికి అవసరం.

**(తర్కం, రచన: సోని కట్కూరి, వెల: రూ 150, ప్రతులకు: అన్ని ప్రముఖ బుక్‌హౌస్‌లు)** **- రమణ వెలమకన్ని**

వెయ్యి మంది ఆచార్యులున్నారు. బౌద్ధతత్వం, న్యాయ, తర్కంలో దార్శనికుడు కావడంతో ధర్మకీర్తి నలందా విశ్వవిద్యాలయంతో ఆచార్య పదవిని పొందాడు. నలందా విశ్వవిద్యాలయం నాడు ప్రపంచంలోనే పెద్ద విశ్వవిద్యాలయం. అక్కడి ఆచార్యుడంటే సామాన్య విషయం కాదు. అక్కడ కూడా బౌద్ధ భిక్షువులు భిక్షలో తెచ్చిన ఆహారాన్ని ఒక పెద్ద తొట్టెలో వేసేవారు. ఆ తర్వాత అందరూ తొట్టెలోంచి ఆహారాన్ని తీసుకొని భుజించేవారు. ఆ మాటకొస్తే గౌతమ బుద్ధుడు జీవించినంత కాలం




భిక్షతోనే జీవించాడు.

"ధర్మకీర్తీ! నువ్వు బౌద్ధంలో యోగాచారం, సౌత్రాంతిక శాఖలలో ప్రవేశించి, ఆ శాఖలకు చెందిన వారిలో గొప్పవాడివయ్యావు. బౌద్ధ తత్వశాస్త్రంలో జ్ఞాన మీమాంసలో సాధికార తర్కవేత్తగా ప్రపంచ ప్రసిద్ధి గాంచావు. ఈ శాస్త్రాలలో నీకు మించినవాడే లేడు. తర్కశాస్త్రంలో నువ్వు రచించిన మీమాంస, న్యాయ శాస్త్రాలు, శైవ శాఖలకు సంబంధించిన సనాతన ధర్మపండితులనే కాకుండా, జైన మత పండితులను కూడా ఎంతో ప్రభావితం చేశాయని తెలిసి చాలా ఆనందించాను.

గర్వపడ్డాను. నువ్వు రచించిన మీమాంసకు చెందిన ప్రమాణ వార్తిక ఎంతో ప్రామాణిక గ్రంథంగా నిలిచిపోయింది. సరైన జ్ఞాన సాధనా ప్రమాణాలపై రచించిన ఈ గ్రంథం అనేక దేశాలలో ప్రత్యేకించి టిబెట్, చీనాలో సాధికార రచనగా గుర్తింపు పొందడం మన నలందా విశ్వవిద్యాలయానికే గర్వకారణం. నువ్వు వజ్రయాన దేశాలైన టిబెట్, చీనా, భూటాన్, నేపాల్‌లను సందర్శించు. అక్కడ వాళ్లు నీ రచనల గురించి ఏమనుకుంటున్నారో నీకే తెలుస్తుంది. వచ్చే వారం మన ఆచార్యులు ఆ దేశాలకు వెళ్తున్నారు. వాళ్లతో పాటు వెళ్లిరా! మనకు తెలిసింది గుప్పెడంత, తెలియాల్సింది అడవంత" అన్నాడు గురువు ధర్మపాలుడు.

ధర్మకీర్తి తన రచనలను సంస్కృత శ్లోకాలలో రచించినా అవి అనేక ప్రతులుగా రాయబడి నలుమూలలకు వ్యాపించాయి. చీనా, టిబెట్ భాషల్లోకి కూడా అనువదింపబడి అక్కడా బహుళ ప్రచారం పొందాయి.



మేనమామ కుమారిల భట్టు ధర్మకీర్తి సిద్ధాంతాలన్నింటినీ ఖండించాడు. అయినా ధర్మకీర్తి పేరు ప్రతిష్ఠలు, రచనలు భారతదేశం, టిబెట్, చీనా దేశాలలో మారుమోగాయి. అతని ఖ్యాతి దశదిశలా వ్యాపించింది.

వజ్రయాన దేశాలను సందర్శించిన ధర్మకీర్తి తిరిగి నలందా విశ్వవిద్యాలయానికి విచ్చేశాడు. గురువు ధర్మపాలుడిని కలిశాడు.

"ధర్మకీర్తీ! నువ్వు రచించిన ప్రమాణ వార్తిక, ప్రమాణ వార్తిక కారిక, ప్రమాణ నిశ్చయ, న్యాయబిందు, హేతు బిందు, సంబంధ పరీక్ష, సంబంధ పరీక్షా వృత్తి, వాద న్యాయం, సంతానంతర సిద్ధి గ్రంథాలు వేలకు వేలు ప్రతులుగా రాయబడి అన్ని ప్రాంతాలకు సరఫరా అవుతున్నాయి. వీటన్నింటిలో నువ్వు రాసిన ప్రమాణ వార్తిక అత్యుత్తమ గ్రంథంగా మన నలందా విశ్వవిద్యాలయం ఆచార్యులు తీర్మానించారు. ఇక్కడి విద్యార్థులకు పాఠ్యాంశంగా నిర్ణయించారు. టిబెట్‌లో నిన్ను ఓ మహాత్ముడిగా చూశారు కదూ! నీ గ్రంథంపై అనేక మంది టిబెట్‌లో వ్యాఖ్యలు రచించారు. నువ్వు చెప్పకపోయినా నీతో వచ్చిన ఆచార్యులు నాకంతా చెప్పారు, నీ జన్మ సార్థకమైంది" అని మెచ్చుకొన్నాడు ధర్మపాలుడు శిష్యుడైన ధర్మకీర్తిని ఆప్యాయంగా చూస్తూ.

బౌద్ధ ధర్మంలో ఆరు ఆభరణాలుగా ప్రఖ్యాతి చెందిన ఆరు మంది గొప్ప వ్యాఖ్యాతల్లో ధర్మకీర్తి ఒకడు. రాహుల్ సాంకృత్యాయాన్, ప్రముఖ రష్యా తత్వవేత్త స్టెర్ బాట్స్కీ భారతదేశపు కాంటుగా ధర్మకీర్తిని కొనియాడారు. తిరుపతిలో నివసిస్తున్న మేనమామ కుమారిల భట్టు ధర్మకీర్తి సిద్ధాంతాలన్నింటినీ ఖండించినా అతను నమ్మిన బుద్ధుడ్ని మాత్రం ఖండించలేక పోయాడు. అందుకు కారణం దశావతారాల్లో బుద్ధావతారం ఒకటి కావడమే.

# పార్థుడు పాశుపతాస్త్రం పొందిన క్షేత్రం



**విజయవాడ అనగానే ప్రతి ఒక్కరి మందిలో మెదిలేది ముగ్గురమ్మల మూలపుటమ్మ శ్రీకనకదుర్గ కొలువైన ఇంద్రకీలాద్రి.**

పౌరాణికంగానే కాకుండా చరిత్రలోను మరెన్నో విషయాలలో ఎంతో ప్రాముఖ్యం ఉన్న విజయవాడను పురాణ కాలంలో 'విజయ వాటిక' అని పిలిచేవారు.

అనేక పురాతన గ్రంథాలలో, రాజశాసనాలలో అదే పేరు ఉండటం గమనించవచ్చు. ఈ పట్టనానికి ఆ పేరు రావడానికి సంబంధించిన పురాణ గాథతో ముడిపడి ఉన్న ఒక ప్రసిద్ధ ఆలయం ఇక్కడ ఉంది.

**కిరాతకార్జునీయం**

మాయాజూదంలో దాయాదుల చేతిలో ఓడిపోయిన పాండవులు వనవాసానికి వెళ్లారు. రాబోయే కురు-పాండవ సంగ్రామంలో పాండవులకు విజయం సాధించాలంటే దైవానుగ్రహం తప్పక ఉండాలని, ఆ దిశగా ప్రయత్నం చేయమని చేసిన ఇంద్రుని సలహా మేరకు అర్జునుడు పరమేశ్వర అనుగ్రహం కోసం తపస్సు చేసాడు. పండవ మధ్యముని దీక్ష గంగాధరుని మెప్పించింది. అయినా అతనిని పరీక్షించదలచారు.

కుంతీ నందునుడు తపమాచరిస్తున్న ప్రాంతంలోనే 'ముఖాసురుడు' అనే కౌరవ పక్షపాతి అయిన అసురుడు ఉండేవాడు. అతనికి అర్జునుని తపస్సు గురించి తెలిసింది.

తన మిత్రులైన గాంధారి పుత్రులకు హాని కలిగించేదానిని ఎలాగైనా ఆపాలని నిర్ణయించుకొన్నాడు దానవుడు.

అడవి పంది రూపంలో వెళ్లి అర్జునుడు ఉన్న ప్రాంతాలలో కల్లోలం సృష్టించసాగాడు. సహనంతో అతని ఆగడాలను చాలాకాలం సహించాడు సవ్యసాచి.

అంతకంతకు అసురుని అరాచకం ఎక్కువవడంతో కోపంతో కిరీటి విల్లు ఎక్కుపెట్టి బాణం వదిలాడు.

అదే సమయంలో కిరాతకుని రూపంలో వచ్చిన కైలాసనాథుడు కూడా బాణం వరాహం పైకి వేసాడు. మరణించిన వరాహం దేహంలో రెండు శరాలు ఉండటంతో దానిని చంపింది నేను అంటే నేను అన్న వాదం మొదలై చివరకు సమర రూపం దాల్చింది. ఎన్నో అస్త్రాలను ప్రయోగించినా అవి కిరాతకుణ్ణి ఏమీ చేయలేకపోయాయి. శక్తులన్నీ నిష్ఫలమవడంతో.. అర్జునుడు గాండీవాన్ని ఎత్తి కిరాతకుణ్ణి మోదబోయాడు.

అప్పుడు నిజ రూపంతో దర్శనమిచ్చిన నందివాహనుడు విజయం దక్కించుకొన్న కారణాన "విజయా!" అని సంబోధించి ఆశీర్వదించి 'పాశుపతాస్త్రం' ప్రసాదించారు.

ఈ సంఘటన జరిగింది కృష్ణా నది తీరంలో ఉన్న ఇంద్రకీలాద్రి వద్దనే అని మహాకవులు రచించిన కావ్యాల ఆధారంగా అవగతమవుతోంది.

ఈ ఉదంతం ఆధారంగా సంస్కృతంలో 'భారవి' అనే కవి 'కిరాతకార్జునీయం' అనే ప్రసిద్ధ కావ్యం రాయగా- అదే






కథను అదే పేరుతో తెలుగులో శ్రీనాథ కవి రచించారు. అలా పార్వతీ వల్లభుడు పెట్టిన పరీక్షలో విజయుడైన క్షేత్రంగా పాండవ మధ్యముని పేరు మీద 'విజయవాటిక'గా పిలవబడి కాలక్రమంలో విజయవాడగా మారింది.

కరుణించినందుకు కృతజ్ఞతగా అర్జునుడు తమ పోరు జరిగిన స్థలంలో ఒక లింగాన్ని ప్రతిష్టించాడు. విజయుడు ప్రతిష్టించిన లింగం కనుక శ్రీ విజయేశ్వర స్వామిగా పిలవబడుతోంది.

ఇంద్రకీలాద్రి పర్వత పాదాల వద్ద ఉండే ఈ ఆలయం తనవైన ప్రత్యేకతలతో కొలిచినవారికి కొంగు బంగారంగా ప్రసిద్ధికెక్కింది. రహదారి నుండి కొద్దిగా ఎత్తులో ఉండే ఆలయాన్ని చేరుకోడానికి సోపాన మార్గం ఉంది. పై భాగంలో పురాతన ముఖ, గర్భాలయాలకు అనుబంధంగా నిర్మించిన మండపంలో ఒక పక్క నవగ్రహ సన్నిధి, రెండో పక్క శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయం ఉంటాయి. ప్రతి రోజూ ఎందరో భక్తులు ప్రదక్షిణలు, వ్రతాలు చేయించుకోడానికి వస్తుంటారు.

అన్ని రకాల నక్షత్ర, గ్రహ శాంతి హోమాలు కూడా ఈ ఆలయంలో విశేషంగా జరుగుతాయి.

ప్రదక్షిణా పథంలో ఉన్న ఉప ఆలయాలలో విఘ్నేశ్వరుడు, గర్భాలయ వెలుపలి దక్షిణ గోడకు శ్రీ మేధో దక్షిణామూర్తి, వెనుక చిన్న మండపంలో గణపతి, లింగరాజు, ఆంజనేయుడు కొలువై ఉంటారు.

గురువుకు తొలి రూపం శివుడు. ఆయనే దక్షిణామూర్తి. దక్షిణ భారతదేశంలోని అన్ని శివాలయాలలో ఈయన కొలువుతీరి ఉంటారు. మేధో దక్షిణామూర్తి స్వామికి ఉన్న పద్దెనిమిది రూపాలలో ఒకటి విద్యా జ్ఞాన ప్రదాత. గురువారాలు ఇక్కడ ప్రత్యేకంగా మేధో దక్షిణామూర్తికి అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటారు.

ఉత్తరం పక్కన ప్రత్యేకంగా శ్రీ అభయాంజనేయ స్వామి ఉపాలయాన్ని నిర్మించారు. ఆలయ ప్రాంగణంలో నాగ ప్రతిష్ఠలు ఉన్నాయి.

శ్రీ విజయేశ్వర స్వామివారికి ఎన్నో వాహనాలు ఉన్నాయి. వాటిల్లో ప్రత్యేకమైనది రావణ వాహనం.

ప్రదక్షిణ ఫలితం

శ్రీ విజయేశ్వర స్వామి ఆలయానికి ఒక ప్రత్యేకత ఉంది. పరిపూర్ణ విశ్వాసంతో ఎవరైతే స్వామిని సేవిస్తారో వారి జీవితాలు ఎలాంటి అడ్డంకులూ లేకుండా విజయవంతంగా సాగిపోతాయి. కంచి స్వామి శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర సరస్వతిస్వామి ఈ ఆలయాన్ని సందర్శించి ఇక్కడి స్వామి మహాత్యాన్ని గుర్తించి అది భక్తులకు శుభాలను కలగచేయాలన్న ఉద్దేశంతో ఒక నియమం రూపొందించారు. ఎలాంటి కష్టాలలో ఉన్నవారైనా ఈ ఆలయాన్ని సందర్శించి ఇరవై ఏడు ప్రదక్షిణలు చేస్తే వారితో పాటు కుటుంబ సభ్యుల జన్మ నక్షత్ర, గ్రహ సంబంధ దోషాలు తొలగిపోయి అన్నింట్లో విజయం లభిస్తుందని విశ్వసిస్తారు. ఇరవై ఏడు అన్నది జన్మ నక్షత్రాలకు సంబంధించినది. మనం చేసే ప్రదక్షిణాలు మొత్తం కుటుంబంలోని అందరి నక్షత్ర దోషాలను తొలగిస్తుందన్నదే ఈ ప్రదక్షిణాలలోని అంతరార్థం.

**శ్రీ బ్రహ్మాస్త్రా దేవి**

అర్జునుడు పరమేశ్వరుని నుండి పాశుపతాస్త్రం పొందినది ఇక్కడే అన్నదానికి రుజువుగా ఉపాలయాల్లో శ్రీ బ్రహ్మాస్త్రాదేవి ఉంటారు. పక్కనే మరో సన్నిధిలో శ్రీపార్వతీదేవి దర్శనమిస్తారు. అన్ని రోజుల్లో ఆలయం భక్తులతో కళకళలాడుతుంటుంది.

కార్తిక మాసంలో, వనరాత్రుల్లో, మాస శివరాత్రులలో విశేష పూజలలో పాల్గొనడానికి భక్తులు తండోప తండాలుగా తరలి వస్తారు. శ్రీ విజయేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే దారిలో కాలవ ఒడ్డున పురాతన శ్రీ వినాయక ఆలయం ఉంది. తప్పనిసరిగా దర్శించాల్సిన ఆలయమిది.

**- ఇలపావులూరి వెంకటేశ్వర్లు**






# ఒకే మాట

కథ

కె.లక్ష్మీశైలజ

శ్రావణ మాసపు చిరుజల్లులు పడిన తరువాత వస్తున్న మట్టివాసనను పీలుస్తూ, జామచెట్టు ఆకుల మీద నుంచి రాలిపడుతున్న నీటిచుక్కలను చూస్తోన్న అనిత, ఇంట్లోనుంచి వినపడ్తోన్న తల్లిదండ్రుల మాటలకు ఈ లోకంలోకొచ్చింది.

అనితకు వారం క్రితమే పెళ్లయింది. ఇంకా కాపురానికి పంపలేదు. ప్రస్తుతం ఆఫీసుకు సెలవు పెట్టి ఉంది. మూడవ సంవత్సరం ఇంజినీరింగ్ చదువుతున్న కాలేజీ ఫీజు గురించి తల్లిదండ్రులు మాట్లాడుకుంటున్నారని అనితకు అర్థమైంది.

"వాడి కాలేజీ ఫీజు కట్టాలి, ఈ సంవత్సరం రెండు జతల బట్టలు కుట్టించాలి, హాస్టలు ఫీజు కట్టాలి. ఇప్పుడు ఈ డబ్బు వాడకూడదని అనుకుంటే, ఏదో ఒక ఎఫ్.డి.ని బ్యాంక్ నుంచి తీసేసుకోవాలి. ఇలా ప్రతి సంవత్సరం తీస్తూ పోతే, మనకు చివరికి ఏం మిగులుతుంది? రేపు వాడికి పెళ్లయిన తరువాత మనం కొడుకు, కోడలు మీద ఆధారపడవలసి వుంటుంది. అప్పుడు కోడలేమైనా అంటే మన గతేంటి?" అంటున్నాడు అనితవాళ్ల నాన్న వెంకటేశం. అనిత పెళ్లికి వచ్చిన చదివింపుల డబ్బును వాడవద్దని అనిత వాళ్లమ్మ చెప్పినందుకు. అతను దూరాలోచన చేస్తున్నాడు. అతని ఆలోచన కూడా నిజమే కదా!



"అలాగ మాట్లాడితే ఎలాగ? మనకొచ్చే పెన్షన్‌డబ్బులు మనకుంటాయి కదా. అవి కూడా లేనివాళ్ల సంగతేంటి? పిల్లల అవసరాలు తీర్చకుండా ఆపగలమా? రేపు నెలలో అనితను కాపురానికి పంపేటప్పుడు చీర, సారె తీసివ్వాలి కదా! కొన్ని కొన్ని తప్పనిసరి ఖర్చులు కాదనలేం" అంటూ వాళ్లమ్మ రాజేశ్వరి జరగవలసిన ఇంకో ఖర్చును కళ్లముందుంచింది.

"చిన్నగా మాట్లాడు, అమ్మాయి వింటుంది" అన్న వెంకటేశం మాటలతో ఇద్దరూ సైలెంట్ అయ్యారు.

వెంకటేశం, రాజేశ్వరి సంసారాన్ని బాగా పొదుపుగా జరుపుకున్నారు. వెంకటేశం జీతంలో చాలా భాగం సేవ్ చేసుకుంటూ, పిల్లలను చదివించుకుని, చిన్న ఇల్లు కొనుక్కున్నాడు. డబ్బంతా ఎక్కువ భాగం ఆర్.డి.లు కట్టి తిరిగి వాటిని ఎఫ్.డి.లుగా వేసుకుంటూ నెల ఖర్చుకు చేతిలో కొంచెం డబ్బు ఉంచుకునేవారు. దుబారా ఖర్చులు పెట్టకుండా, దురలవాట్లు లేకుండా డబ్బు దాచుకున్నారు.

ఆ చిన్న ఇంట్లోనే పిల్ల పెళ్లి కూడా చేశారు. ఊర్లో సంబంధం, ప్రయాణపు ఖర్చులు కూడా లేకుండా బాగుందని సంతోషపడి అమ్మాయి పెళ్లి చేశారు. పిల్లపెళ్లికి కూడా ఎక్కువ డబ్బు ఖర్చు పెట్టుకోకుండా, పిల్లకు ఎక్కువ బంగారం పెట్టకుండా, పెట్టవలసిన వరకే పెట్టి, రాజ్యలక్ష్మి ఇంట్లో అంతకుముందు చేయించిన ఒక రెండు నెక్లెస్‌లు తనే ఉంచుకొనేసింది.

వియ్యపువాళ్ల దగ్గర్నుంచి అప్పటికే రుసరుసలు వినిపించాయి కూడా. "ఆ... ఏం బంగారు పెట్టారులే" అని.

అయినా వీళ్లు విననట్టే వున్నారు. "మా పిల్ల కూడా జాబ్ చేస్తోంది. నెల నెలా సంపాదించి ఇస్తుంది.. చాల్లే" అనుకొని ఊరుకున్నారు.

తరువాత వారం అనిత, పట్టుచీర వద్దు, మేం ఎక్కువగా చీరలు కట్టుకోం కదా! అంత ఖరీదు ఎందుకు? అని ఒక సింపుల్ వర్క్ ఉన్న చీర కొనుక్కుంటే, రాజేశ్వరి అందులోనే అనితకు ఒడిబియ్యం పోసి కాపురానికి తీసుకెళ్లింది.

అనిత కట్టుకున్న ఆ చీరను చూసి అత్తగారు ముఖం మాడ్చుకుంది. అయినా గమనించనట్లు ఉండింది రాజేశ్వరి. సంసారానికి సామాను కూడా తక్కువలో తీసిచ్చారు. "మేం తరువాత కొనుక్కుంటాం" అని అనడం వలన, వాళ్ల అత్తగారేమంటున్నా విననట్లే వున్నారు వాళ్లిద్దరు.

శివ, అనిత ఇద్దరూ మద్రాస్‌లో ఉద్యోగం కనుక నాలుగు రోజుల తరువాత మద్రాస్‌లో కొత్త కాపురం పెట్టారు. వారం వారం సూళ్లూరుపేటకు వచ్చి ఇద్దరి తల్లిదండ్రులను చూసివెళ్లేవాళ్లు. అనితకు తల్లిదండ్రులు డబ్బు ఇబ్బంది పడ్తున్నారని మనసులో బాధగా వుండేది. ఇటు అత్తమామలకు డబ్బు ఇబ్బంది లేదు. శివ ఒక్కడే కొడుకు. ఇంక బాధ్యతలు ఏమీ లేవు. మా ఇద్దరి జీతం ఎక్కువే కదా.. అనుకుంటూ ఉండేది.

ఆరోజు ఆదివారం... "అనితా, ఈ రోజు స్పెషల్స్ ఏం చేస్తున్నావు?" అన్నాడు శివ తను ఎక్సర్‌సైజ్ చేస్తూ.

"పిజ్జా ఆర్డర్ ఇద్దామా?" అంది, అనిత.

"అబ్బా మళ్లీ ఒక నాలుగు వందలు ఖర్చు పెట్టాలా? ఏదో ఒక స్పెషల్ చెయ్యొచ్చు కదా!" కొంచెం విసుగ్గా అన్నాడు శివ.

"అయితే పీనట్ రైస్" చేస్తాను అంది, అనిత.

అదో స్పెషల్ వంటకం అనుకున్నాడు శివ. తీరా చూస్తే తిరగమోతలో శనక్కాయల పొడి వేసి, ఆ బాణలిలోనే అన్నం వేసి కలిపింది. శనక్కాయల పొడి అన్నం తింటున్నట్లుగా ఉంది. ఏమీ మాట్లాడకుండా తినేశాడు శివ.

శివ కూడా డబ్బు ఖర్చు పెట్టే విషయంలో జాగ్రత్తగా వుండేవాడు. ఇంటిఖర్చులు కూడా గమనిస్తూ వుండేవాడు. ఇద్దరూ ఉద్యోగం చేస్తే సంసారంలో ఆర్థిక ఇబ్బందులు ఉండవనే ఉద్దేశంతో ఉద్యోగం చేసే అమ్మాయిని చేసుకున్నాడు. అనితవాళ్ల అమ్మా నాన్నవాళ్లు అనితకు బాగా తక్కువ బంగారం పెట్టారనీ, పెళ్లి ఖర్చు కూడా ఎక్కువ ఖర్చు పెట్టకుండా అక్కడక్కడికే చేసారని వాళ్లమ్మ, నాన్నలు అంటుంటే విని కొంచెం మనసులో కినుకగానే వున్నాడు శివ.

శివ ఇంట్లోకి కూడా పెద్దగా సామాన్లు కొనడు. డబ్బు ఎక్కువగా ఖర్చు పెట్టడం అంటూ చేయడు.

అలా ఒక ఆరు నెలలు జరిగిపోయాయి. ప్రతి వారం సూళ్లూరుపేటకు వచ్చినప్పుడు ఇంటికి కావలసిన ఉప్పు, పప్పు తెచ్చుకునేవాళ్లు. మద్రాస్‌లో ఎక్కువ ఖరీదు అనుకున్నవన్నీ ఇంటినుంచి తెచ్చుకునేవాళ్లు. శివ తన జీతం వాళ్ల నాన్నకు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాడని మాటల మధ్యలో ఒకరోజు తెలుసుకుంది అనిత. వాళ్ల నాన్న సూళ్లూరుపేటలో కొత్తగా తీసుకున్న ఇంటికి లోన్ తీరుస్తూ ఉన్నాడట. ఆ ఇల్లు రెంట్‌కు ఇచ్చి ఉన్నారు. అద్దె కూడా వాళ్ల నాన్నే తీసుకుంటాడట. శివ పెట్టే ఖర్చులన్నీ వాళ్ల నాన్నకు చెప్తాడు. వాళ్లు వివరంగా అడిగి తెలుసుకుంటారు కూడా.

అదనపు ఖర్చులేవీ లేకుండా జాగ్రత్త పడతాడు శివ.

శివ వాళ్ల నాన్నకు డబ్బు పంపిస్తూ వున్నాడని తెలిసినప్పటి నుంచి, తను కూడా నాన్నకు ఎందుకు డబ్బు పంపకూడదని ఆలోచిస్తోంది అనిత. నాన్న ఇబ్బంది పడుతున్నాడు. నన్ను వాళ్లు ఫీజులు కట్టి చదివించారు కాబట్టి ఈ రోజు నేను ఉద్యోగం చేసి సంపాదించగలుగుతున్నాను. ఇప్పుడు నాన్నకు డబ్బు అవసరమైనప్పుడు నేను ఇవ్వకుండా వుండడమేమిటి? అని ఆలోచిస్తోంది అనిత. పిజ్జాకు పెట్టే నాలుగు వందలు ఎక్కువనే శివ నాన్నకు డబ్బు పంపిస్తానంటే వింటాడా? అనుకుంది. చెప్పకుండా పంపిస్తే? అని కూడా అనుకుంది.

సామాన్యంగా అమెజాన్‌లో ఏమైనా కొంటేనో, సరుకులు కొనడానికి వెళ్లినప్పుడు మాత్రమే అనిత డెబిట్‌కార్డ్‌ను వాడతారు. అయితే ప్రతి నెలా కట్టే కరెంట్ బిల్లులు, ఆర్.డి.లు, వాళ్ల నాన్నకు ట్రాన్స్ ఫర్ చెయ్యడం.. లాంటివన్నీ శివ చూసుకుంటారు. అందువల్ల అనిత దగ్గర ఎక్కువ డబ్బు ఉండదు. కానీ ఎంతో కొంత ఉంటుంది. శివ ఆ డబ్బును అడగడం లేదా కదా అనుకుంది అనిత. తను ఇంటికి డబ్బు పంపించాలని ఆలోచించడం మాత్రం మానుకోలేదు. ఆరోజు ఆఫీసు టైంలో వాళ్ల నాన్నతో మాట్లాడింది... "నేను మీకు డబ్బు పంపిస్తాను, ఖర్చులకు వాడుకోండి" అన్నది.



"వద్దమ్మా.. మాకేమీ పంపొద్దు. మాకేమీ ఇబ్బంది లేదు. ఏదో ఒక రకంగా సర్దుకుంటూ ఉంటాం. నీ డబ్బెందుకు?" అన్నాడు వెంకటేశం.

"నా డబ్బేంటి నాన్నా. మీరు చదివించి ఉద్యోగం ఇప్పిస్తేనే కదా నాకు ఈరోజు జీతమొస్తోంది అది మీదే కదా నాన్నా" అంది అనిత.

"కాదమ్మా అల్లుడికి తెలిస్తే మర్యాదగా వుండదు, వద్దు" అన్నాడు వాళ్ల నాన్న. అయినా అనిత వినలేదు. తరువాత నెలలో ఒక ఇరవై వేలు వాళ్ల నాన్న పేరున వేసింది.

వెంకటేశానికి ఏం చెయ్యాలో తోచలేదు. అలా ఆరు నెలలు గడిచిపోయాయి. అనిత డబ్బు వేస్తూనే వుంది శివకు తెలియకుండా.

వెంకటేశం వద్దంటూనే ఉన్నాడు.

ఒకరోజు రాత్రి ఏడు గంటల సమయంలో సెల్‌ఫోన్‌లో పాటలు వింటూ వంట ప్రయత్నంలో ఉంది అనిత. శివ డైనింగ్ టేబుల్ మీద లాప్టాప్ పెట్టుకొని మిగిలిన ఆఫీసు పని చేస్తున్నాడు.

"శివా, గ్రైండర్ కొందామా? మిక్సీలో దోసెపిండి తయారు చేస్తూ అంది అనిత.

"ఎప్పుడో వారానికొకసారి వాడేదానికి గ్రైండర్ ఎందుకులే?" అన్నాడు వివ.

"నువ్వు చాలా రోజుల నుంచి సోఫా కొంటే బాగుంటుందని సెలెక్ట్ చేసి పెట్టావు కదా, ఆర్డర్ ఇద్దామా?" అన్నాడు మళ్లీ.

అనిత సంతోషంగా "ఆ.. అవును. ఎల్ షేప్‌లో ఉన్న సోఫా బాగుంటుంది. శివా, నీకు కూడా లింక్ షేర్ చేశాను చూడు" అంది.

"ఆ.. అదే చూస్తున్నాను. నీ బ్యాంక్ అకౌంట్ పాస్‌వర్డ్ చెప్పు" అన్నాడు. టక టకా నంబరు చెప్పింది అనిత. శివ ఆర్డర్ పని చూస్తున్నాడు. అనిత మిక్సీ జార్స్ క్లీన్ చేస్తోంది. శివ ఆర్డర్ చేద్దామని చూస్తూ బ్యాలన్స్ సరిపోలేదు. ఏమిటి? చాలా తక్కువగా వుంది, అని. వివరంగా ఖర్చులన్నీ చూశాడు. అందులో ఆరు నెలల నుంచీ డబ్బు పంపే విషయం గమనించాడు.


**రచనలకు ఆహ్వానం**

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరే వారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి.**

**రచనలు పంపించాల్సిన చిరునామా:**

**ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.** sunmagvaartha@gmail.com

"అనితా.. ఇలా రా" అన్నాడు అర్థం గాక.
చేతులు టవల్‌తో తుడుచుకుంటూ అనిత వచ్చి అతని పక్కనే కుర్చీలో కూర్చుంది.
"ఏమిటిది?" లాప్టాప్ అనిత ముందుకు జరుపుతూ అన్నాడు శివ.
శివ వేలు చూపించిన చోట చూడగానే అనితకు ముచ్చెమటలు పోశాయి. "అదీ.. అదీ.." అంటూ నీళ్ల నమిలింది.
శివ అనితనే చూస్తున్నాడు. "నాన్నకు డబ్బు ఇబ్బందిగా వుందని నెల నెలా నేను డబ్బు పంపిస్తున్నాను. నువ్వు వప్పుకోవేమోనని నీకు చెప్పలేదు. నా జీతంలో నుంచే పంపిస్తున్నాను కదా అని నీతో అనలేదు" అని కొంచెం భయంగా అంది.
"నాకు చెప్పకుండా మీ వాళ్లకు డబ్బు పంపిస్తున్నావా? ఎంత ధైర్యం నీకు? ఒకసారి కాదు, రెండు సార్లు కాదు, ఆరు నెలల నుంచీ పంపిస్తూ వున్నావంటే నీకు తప్పు చేస్తున్నాననే భయం లేదన్నమాట. అయినా నువ్వు పంపితే మీ వాళ్లు ఎలా తీసుకున్నారు?" అంటూ గట్టిగా అరిచాడు శివ. వెంటనే వాళ్ల అమ్మా నాన్నలకు ఫోన్ చేశాడు.
"శివతో చెప్పి పంపి ఉండొచ్చు కదా" అన్నారు వాళ్లు అనితతో.
అనిత కొద్దిసేపటి తరువాత "ఇందులో తప్పేముంది? నీ జీతంలో నుంచి మీ అమ్మా నాన్నలకు నువ్వు పంపిస్తున్నట్లు, నా జీతంలో నుంచి మా అమ్మా నాన్నలకు నేను పంపించాను" అని అన్నది.
అయితే మీ అమ్మా నాన్నల దగ్గరికే నువ్వు వెళ్లిపో. నువ్వు ఇంత చేసేదానివని నాకు తెలియదు. నువ్వు ఇక్కడినుంచి వెళ్లిపో" అంటూ ఫోన్‌లో వాళ్ల అమ్మా నాన్నలతో అనితను వాళ్లింటికి పంపించెయ్యండి, విడాకులు తీసుకుందాం" అంటున్నాడు.
అనిత బిత్తరపోయింది.
"ఇంత గొడవ చేస్తున్నాడు. నెమ్మదిగా చెబ్దాంలే అనుకుంటే" అని మంచం మీద కూర్చొని ఏడుస్తూ ఉండిపోయింది.
ఆ పూట ఎవరూ భోజనం చెయ్యలేదు. శివ వాళ్లమ్మ వాళ్లతో అవతల రూంలోకెళ్లి గబగబా అరుస్తూ మాట్లాడుతూ ఉన్నాడు.
తెల్లవారి అనితను తీసుకొని శివ సూళ్లూరుపేటకు బయలుదేరాడు. అక్కడ వాళ్లమ్మ నాన్నలతో గట్టిగా మాట్లాడుతూనే ఉన్నాడు.
అత్తగారు, మామగారు అనితను ఏమీ అనలేదు. సాయంత్రం ఫోన్ చేసి అనిత వాళ్ల అమ్మ, నాన్నలకు విషయం చెప్పారు, శివ వాళ్ల నాన్నగారు.
"మీ అమ్మాయి మా అబ్బాయికి తెలియకుండా మీకు డబ్బు పంపించిందనీ, మీ అమ్మాయితో కాపురం చేయలేనని, పుట్టింటికి పంపించెయ్యమని" చెప్తున్నాడు మా అబ్బాయి. మీరు వచ్చి మాట్లాడండి" అని చెప్పాడు.
"అయ్యో! అలాగా. మేం సాయంకాలం వస్తున్నా"మని వెంకటేశం అన్నాడు.
సాయంకాలం వచ్చారు అనిత అమ్మా నాన్నలు.
వాళ్లను చూడగానే ఏడుస్తూ వాళ్ల దగ్గరకు వెళ్లింది అనిత.
వాళ్ల అత్తా మామలు కూర్చోమని చెప్పి కాఫీ ఇచ్చారు.
శివ వచ్చి కూర్చున్నాడు.
మొదట వెంకటేశం మాట్లాడాడు.
"అమ్మాయి డబ్బు పంపించింది నిజమే బావగారు" నేను వద్దని చెప్పాను కానీ ఆ డబ్బు తమ్ముడి ఫీజులకు వాడుకొమ్మని చెప్పింది. నేనా పని చెయ్యలేదు అని వెంకటేశం చెప్పుండగానే "మీరా విషయం నాకెందుకు చెప్పలేదు" అని శివ అన్నాడు.

"అనితా! తప్పమ్మా! అలా అనకూడదు. నువ్వు శివ భార్యవయిన తరువాత పుట్టింటికి డబ్బివ్వాలని నువ్వనుకోకూడదు.

"తప్పే బాబూ. మీకు చెప్పవలసింది. మీకు తెలియకుండా పంపవద్దని చెప్పాను నేను. పెళ్లయిన ఆడపిల్లలు భర్త ఇంటిని చూసుకోవడం మన సంప్రదాయం. అందుకే నేను తీసుకోను అంటే–
"తీసుకోకుంటే నా మీద వట్టన్నది" అన్నాడు వెంకటేశం.
"చిన్న పిల్ల.. ఏదో అన్నదని పెద్దవారు మీరు కూడా విషయం మరుగుపరచారు" అన్నారు వాళ్ల మామ్మగారు.
"అవునండీ తప్పే. నేను మీకు చెప్పి ఉండాల్సింది" అన్నాడు వాళ్ల నాన్న కంగారుగా మొహం తుడుచుకుంటూ.
అనిత సోఫా వెనుక నిలబడి అన్నీ వింటోంది. నెమ్మదిగా ఏడుస్తోంది. నాన్న వాళ్లతో వంగి, వంగి మాట్లాడుతుంటే ఇబ్బందిగా వుంది.
"ఒకరోజు కాదు, ఆరు నెలల నుండి పంపుతోంది" అన్నాడు శివ.
"మరీమధ్యలో ఒక్కరోజైనా నాతో అయినా చెప్పి ఉండొచ్చుగా. పెళ్లయిన తరువాత నా అకౌంట్, నా డబ్బు అనుకోవడం మంచిది కాదు అనితా. నువ్వు ఏ పని చేసినా చెప్పకుండా చేస్తే అది చిన్న పొరపాటయినా చెప్పలేదనే మాట ముందొస్తుంది, నీ మీద నమ్మకాన్ని పోగొట్టుకున్నావు" అంది వాళ్లత్తయ్య.
"కానీ నువ్వు మీ నాన్నకు పంపావు కదా. నేను మా నాన్నకు పంపితే తప్పేంటి" అంటోందమ్మా అన్నాడు శివ.
"అనితా! తప్పమ్మా! అలా అనకూడదు. నువ్వు శివ భార్యవయిన తరువాత పుట్టింటికి డబ్బివ్వాలని నువ్వనుకోకూడదు. పెళ్లయిన కూతురు నుంచి మేం డబ్బు ఆశించకూడదు. ఆడపిల్ల సొమ్ము తింటే అష్టకష్టాలు వస్తాయట" అంది వాళ్లమ్మ.
"అయినా మీ అమ్మా నాన్న గతిలేని పరిస్థితుల్లో లేరు కదా అనితా. రిటైర్మెంట్ బెనిఫిట్స్ వచ్చాయి. నెలకు పెన్షన్ వస్తోంది. స్వంత ఇల్లు, ఎంతో కొంత డబ్బు బ్యాంకులో ఎఫ్.డిల రూపంలో వుంది, బంగారం వుంది. వెనుక ఆడపిల్లలు లేరు. ప్రతి నెలా ఎక్కడో ఒక చోటకు తీర్థయాత్రలకు వెళ్తున్నారు. కాశీకి వెళ్లి వచ్చారు. పోయిన నెల భద్రాచలం వెళ్లారు. మొన్ననే తిరుపతికి వెళ్లి వచ్చారు. ఇంకెందుకు నీకు దిగులు? మధ్య మధ్యన ఇబ్బందులు వస్తూ పోతూ వుంటాయి. మనకు లేవా ఇబ్బందులు? ఇప్పుడు కొత్తింటికి లోన్ తీరుస్తూ వున్నాం. ఆ ఇంటికి ప్రతి నెలా ఏదో ఒక ఖర్చవుతోంది. మనం ఎవరిని అడుగుతాం?" అంటున్న వాళ్ల అత్తగారు తన ఫోన్ శబ్దం విని లోపలికి వెళ్లింది.
"బావగారూ! అమ్మాయిది పొరపాటే క్షమించాలి" అంటూ–
శివ వైపు తిరిగి "బాబూ, చిన్న పిల్ల. తల్లిదండ్రులను తనేదో ఆదుకోవాలనే ఆరాటమే తప్ప మీకు చెప్పకుండా ఇలా చేయడమనే ఇష్టమేం కాదు. పెద్దమనసు చేసుకొని క్షమించండి" అని వెంకటేశం అంటూ వుండగానే..
వాళ్లత్తగారు ఇంట్లో నుంచి వస్తూ "ఇది చూశారా? అరగంట క్రితం ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసిందట. సావిత్రమ్మ ఫోన్ చేసి అడుగుతోంది. కోడలిని హింసిస్తున్నారట కదా. ఫేస్‌బుక్‌లో చదివానని ఇదిగో ఇది చదవండి" అని మామగారికి ఫోన్ ఇచ్చింది. ఆ ఫోన్‌లో మామ చదువుతూ ఆయన అనిత వైపు కొంచెం కోపంగా చూశారు. "పేస్‌బుక్‌లో పోస్ట్ చేసింది నేనే.

**(మిగతా 27వ పేజీలో)**

నల్లగా ఉండే పొడవాటి జుట్టు మహిళల అందాన్ని మరింత మెరుగుపరుస్తుంది. ఈ కారణంగానే చాలా మంది అమ్మాయిలు పొడవాటి, ముదురు, మందపాటి జుట్టు కలిగి ఉండాలని కోరుకుంటారు. మోడలింగ్ రంగంలోకి అడుగు పెట్టినప్పుడు కూడా పొడవాటి జుట్టుకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. పొడవాటి జుట్టు కోసం అమ్మాయిలు పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తారు. అయితే అక్కడ మహిళలకు



# ఆ గ్రామంలో మహిళలందరికీ పొడవైన జుట్టు

అటువంటి ప్రయత్నాలు చేయాల్సిన పనిలేదు. వారికి సహజంగానే నల్లని తాచుపాములా జాలువారే జుట్టు వారి సొంతం. చైనా మహిళలు పొడవాటి జుట్టుకు ప్రపంచంలోనే చాలా ఫేమస్. అంతేకాదు.. సిల్కీ హెయిర్ వారి జుట్టు ప్రత్యేక లక్షణం. చైనాలోని పురాతన గ్రామమైన హువాంగ్లూలోని మహిళల జుట్టు గురించి తెలుసుకుంటే ఆసక్తికరంగా ఉంటుంది. ఈ గ్రామం జిన్షా నది ఒడ్డున ఉంది. రెడ్ యావో ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారు. ఈ మహిళలు పొడవాటి, మందపాటి, నల్లని జుట్టుకు ప్రసిద్ధి చెందారు. ఇక్కడి మహిళ జుట్టు ఒకటిన్నర నుండి రెండు మీటర్ల కంటే ఎక్కువ పొడవు ఉంటుంది. అందుకనే ఈ గ్రామాన్ని లాంగ్ హెయిర్ విలేజ్ అని కూడా అంటారు. ఈ గ్రామం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో కూడా పేరు నమోదు చేసుకుంది. ఈ గ్రామం పొడవాటి వెంట్రుకలు ఉన్న గ్రామంగా గుర్తింపు పొందింది. స్త్రీ జుట్టు పొడవు ఆమె కుటుంబానికి అదృష్టం కలిగిస్తుందని ఇక్కడి ప్రజలు బలంగా నమ్ముతారు. ఈ ప్రాంతం ప్రత్యేకత ఏమిటంటే ఇక్కడి మహిళలు జీవితంలో ఒక్కసారే జుట్టు కత్తిరించుకుంటారు.



ఇక్కడి అమ్మాయిలు తమ 18వ పుట్టిన రోజున హ్యారీ కట్ చేసుకుంటారు. అంటే ఇలా జుట్టు హ్యారీ కట్ చేయించుకున్న అమ్మాయి వివాహానికి సిద్ధమైందని అర్థం. భాగస్వామిని వెతుకుతున్నప్పుడు జుట్టును ఇక్కడి అమ్మాయిలు కనిపించకుండా కప్పుకుంటారు. కత్తిరించిన జుట్టు ఆ అమ్మాయి అమ్మమ్మ వద్ద ఉంటుంది. ఆ జుట్టును వివాహానంతరం వరుడికి బహుమతిగా ఇస్తారు. పెళ్లికి ముందు మాత్రమే అమ్మాయిలు తమ జుట్టును కాబోయే భర్తకు చూపిస్తారు.

అలాగే ఈ గ్రామంలో ప్రతీ సంవత్సరం మార్చి 3వ తేదీన పొడవాటి కేశాల పండుగను కూడా జరుపుకుంటారు. ఇందులో మహిళలు పాడటం, నృత్యాలు చేయడం ద్వారా తమ జుట్టును ప్రదర్శిస్తారు. ఈ పండుగను చూసేందుకు ఇతర దేశాల నుండి సైతం పెద్ద ఎత్తున టూరిస్టులు వస్తారు. ఇక్కడి మహిళ పొడవాటి జుట్టు రహస్యం బియ్యం నీరు. ఇక్కడ పండే ఒక రకమైన బియ్యం ప్రత్యేకించి దాని నీటిని వినియోగిస్తారు. వీరు షాంపూ వంటి వాటిని అసలు దగ్గరకు చేరనీయరు. అంతే కాకుండా అక్కడి నదిలోని నీళ్లతో జుట్టును కడుగుతారు.

**అత్యంత పొడవైన చేతి గోర్లు కలిగిన మహిళ**

ప్రపంచంలోనే భిన్నమైన అభిరుచులు ఉన్న వ్యక్తులు ఉంటారు. అటువంటి వారిలో ముఖ్యంగా మహిళలు తమకూ ఒక గుర్తింపు రావాలని కోరుకుంటారు. అందుకు వివిధ తమ అభిరుచులకు తగినట్లుగా ప్రత్యేతను నిలుపుకొనేందుకు ఆసక్తి చూపిస్తూంటారు. ప్రధానంగా మహిళలకు చేతి గోర్లు పెంచడం అంటే చాలా ఇష్టం. అమ్మాయిల అందాల్లో అదీ ఒకటి. పొడవైన గోళ్లకు నెయిల్ పాలిష్ పెట్టి వాటిని మరింత అందంగా తీర్చిదిద్దుతారు. దాదాపు అందరు అమ్మాయిలూ ఇలాగే చేస్తుంటారు. అయితే ఎంత ఇష్టమైనా గోర్లను సెంటీమీటర్‌కు మించి పెంచరు. కానీ ఇక మహిళ ఏకంగా 24 అడుగుల పొడవున గోర్లను పెంచేసింది. ఒక రోజు, నెల రోజులు కాదు కదా దాదాపు 30 సంవత్సరాల పాటు ఈ మహిళ తన గోర్లును పెంచుకుంటూ వచ్చింది. హ్యూస్టన్‌కు చెందిన అయన్నా విలియమ్స్ అనే మహిళ 2017 సంవత్సరంలో ప్రపంచంలోనే అతి పొడవైన చేతి గోర్లు కలిగిన వ్యక్తిగా రికార్డు సృష్టించింది.



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



విదేశీ ప్రయాణ ప్రయత్నాలు ఫలిస్తాయి. స్వగృహ రుణాలు తీర్చి ఊరట పొందుతారు. విద్యార్థులకు పోటీ పరీక్షల్లో విజయం లభిస్తుంది. స్త్రీలకు ఆరోగ్యం కుదుట పడుతుంది. మీ శక్తిమేరకు దానధర్మాలు చేస్తారు. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. కాలానుగుణంగా వ్యాపారం చేసేవారికి ఆశించినదానికంటే ఎక్కువ లాభాలుంటాయి.

## వృషభం



స్త్రీలకు స్థిరాస్తి కలిసొస్తుంది. మీ చిరకాల వాంఛ నెరవేర్చుకుంటారు. ఏది జరిగినా మన మంచికే అన్న ధోరణి అలవడుతుంది. ధర్మ రక్షణకై పాటుపడతారు. కుటుంబంలో స్వల్ప అభిప్రాయ భేదాలు రావొచ్చు. వృధా ఖర్చులను నియంత్రిచడంలో విఫలమవుతారు. దుర్వ్యసనలకు దూరంగా వుండడం ఆరోగ్యరీత్యా మంచిది. శుభకార్య చర్చలు ఫలిస్తాయి.

## మిథునం



శారీరక, మానసిక అలసటకు లోనవుతారు. వృత్తి విద్యల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. భాగస్వామ్య వ్యాపారులకు సామాన్యంగా ఉంటుంది. అనూహ్యంగా మొండి బకాయిలు వసూలవుతాయి. వ్యవసాయ భూమి కొనుగోలు చేసే సూచనలున్నాయి. ఆలోచనలు అస్థిరంగా ఉంటాయి. ఉమ్మడి కుటుంబ విలువ తెలుసుకుంటారు.

## కర్కాటకం



ఆరోగ్య సమస్యలుంటాయి. వృత్తి విద్యా కోర్సులు అభ్యసించినవారికి ఆర్థికంగా బాగుంటుంది. విద్యార్థులకు శుభ యోగం. సన్నిహితుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. ఉద్యోగులకు సహోద్యోగులతో సఖ్యత ఏర్పడుతుంది. తీర్థ యాత్రలు చేస్తారు. కింది స్థాయిలో ఉద్యోగులతో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించండి.

## సింహం



గతంలో ఆగిపోయిన పనులు తిరిగి పూర్తి చేస్తారు. వృత్తి రంగాల్లో వున్నవారికి పోటీ ఏర్పడుతుంది. ప్రముఖులతో పరిచయం ఏర్పడుతుంది. చిరు వ్యాపారులకు బ్యాంకు రుణాలు చేతికందివస్తాయి. కొత్త విషయాలు తెలుసుకోవాలన్న ఆసక్తి ఏర్పడుతుంది. స్త్రీలకు ఆరోగ్య సమస్యలుంటాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. నూతన గృహ యోగం.

## కన్య



ప్రభుత్వ సంబంధమైన పనులు వారాంతంలో పూర్తి అవుతాయి. శ్రమకు తగిన ప్రతిఫలం పొందుతారు. ధర్మ రక్షణకై పాటుపడతారు. ఆధ్యాత్మిక చింతన అలవడుతుంది. సంతానాభివృద్ధి గురించి చేసే చర్చలు ఫలిస్తాయి. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరిస్తారు. అనూహ్యంగా మొండి బకాయిలు వసూలవుతాయి. ఉద్యోగులకు బాధ్యతలు అధికం.

## తుల



వారమంతా ఉత్సాహంగా గడుస్తుంది. అన్ని రంగాల్లోనివారు ఎంతో కొంత లాభపడతారు. స్త్రీలకు స్థిరాస్తులు లభిస్తాయి. విదేశీ ప్రయాణ సూచనలున్నాయి. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం చెప్పదగిన సూచన. ఉద్యోగస్తులకు బాధ్యతలు పెరుగుతాయి. మీ శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. వారాంతంలో మీరు ఊహించని ముఖ్యమైన సంఘటన జరుగుతుంది. తొందరపాటు నిర్ణయం తీసుకోకండి.

## వృశ్చికం



తొందరపాటు చర్యలు చేపట్టకండి. నూతన వ్యక్తులతో పరిచయం ఏర్పడుతుంది. సన్నిహితుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. వృత్తి విద్యా కోర్సుల్లో చేరతారు. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. తాహతుకు మించిన రుణాలు చేయకపోవడం మంచిది. వాదోపవాదాలకు దూరంగా వుండడం చెప్పదగిన సూచన. శుభ కార్యాలకు హాజరవుతారు. కోర్టు తీర్పులు సానుకూలంగా వుంటాయి.

## ధనుస్సు



ఎదురు చూస్తున్న శుభ సమాచారం తెలుసుకుంటారు. వృత్తి విద్యా కోర్సులు అభ్యసించిన వారికి ఆర్థికంగా బాగుంటుంది. వ్యాపారులకు అనుకోని చోట్ల స్వల్ప నష్ట సూచనలున్నాయి. గతంలో ఆగిపోయిన పనులు తిరిగి ప్రారంభిస్తారు. విందు-వినోదాల్లో పాల్గొంటారు. ఉద్యోగులకు పై అధికారుల వత్తిడి పెరుగుతుంది. ప్రభుత్వ సంబంధమైనపనులు వాయిదా పడతాయి. బ్యాంకు రుణాలు తీర్చడంలో ఇబ్బందులు.

## మకరం



ఉద్యోగ ప్రయత్నం ఫలించే సూచనలున్నాయి. చోర భయం పొంచి వుంది. ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండండి. కుటుంబ గౌరవం పెంపొందుతుంది. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. జీవిత భాగస్వామి ద్వారా స్థిరాస్తి కలిసొస్తుంది. విలాసవంతమైన జీవితం పట్ల ఆసక్తి కలుగుతుంది. డ్రైవింగ్‌లో మెళకువలు నేర్చుకుంటారు. తీర్థ యాత్రలు చేస్తారు. చిరకాల వాంఛ నెరవేర్చుకుంటారు. ఆకస్మిక ప్రయాణం లాభిస్తుంది.

## కుంభం



అన్ని వ్యవహారాల్లో మీదే విజయం. ఊహించని వార్తలు వింటారు. వ్యతిరేకతలు ఎదురైనా సకాలంలో పనులు పూర్తి చేస్తారు. ధార్మిక చింతన అలవడుతుంది. వృధా కాలక్షేపం ఏమాత్రం మంచిది కాదు. భూ వివాదాలు తీరుతాయి. కొన్ని చోట్ల వ్యాపారులకు అనుకోని ధన నష్టం కలుగుతుంది. భాగస్వామ్య వ్యాపారులకు సామాన్యంగా ఉంటుంది.

## మీనం



ఆదాయానికి తగిన ఖర్చులుంటాయి. బాల్య మిత్రుల సహకారం లభిస్తుంది. ఆలోచనలు అస్థిరంగా ఉంటాయి. విలువైన వస్తువులు సమకూర్చుకుంటాయి. వృద్ధుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తారు. మీ ఆశావహ దృక్పథమే మీకు మేలు చేస్తుంది. ఉమ్మడి ఉటుంబాల విలువ తెలుసుకుంటారు. ఉద్యోగులకు సహోద్యోగులకు సఖ్యత ఏర్పడుతంది. కళాకారులకు ప్రోత్సాహం లభిస్తుంది. తీర్థ యాత్రలు చేస్తారు.

**వాస్తువార్త**
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్: 9885446501/9885449458



# యజమాని ఇంటిపట్టున ఉండాలంటే?

ఆఫీసు టైం అయ్యాక భర్త నేరుగా ఇంటికి రావాలని భార్య కోరుకుంటుంది. అలాగే (భార్య కూడా ఉద్యోగస్తురాలయితే) భర్తా కోరుకుంటాడు. ఇంట్లో పిల్లలు కూడా తండ్రి సాయంత్రం త్వరగా ఇంటికి రావాలని ఎదురు చూస్తుంటారు. ఏవో అనుకోని పని వత్తిడుల వల్లగానీ, మరేదయినా కారణాల వల్లగానీ సమయానికి ఇల్లు చేరకపోవడం సర్వసాధారణం. అలాంటి సమస్యలకు కూడా వాస్తులో పరిష్కారం వుందంటే ఎవరికైనా ఆశ్చర్యం కలుగుతుంది. మీరూ ప్రయత్నించి చూడండి.

ఇల్లు కట్టుకునేటప్పుడు ఇంటికి తూర్పు భాగం కంటే పశ్చిమ భాగంలో (కాంపౌండ్ గోడలోపల) తక్కువ స్థలాన్ని వదలాలన్నది వాస్తు నియమం. అలా వదిలిన ఇళ్లల్లో యజమానులు సాయంత్రాలు ఇంటికి త్వరగా వస్తుంటారు. సెలవుల్లో ఎక్కువ సమయం ఇంట్లో గడుపుతారు. ఒకవేళ కాంపౌండ్ వాల్స్ లేని ఇళ్లు వుంటే ఏం చేయాలి? అనే ప్రశ్న వెంటనే వస్తుంది. దానికి చిన్న సర్దుబాటు చేసుకోవచ్చు. యజమాని బెడ్ రూమ్ నైరుతి భాగంలో వున్న గదిలో నైరుతి మూలన ఏర్పాటు చేయాలి. తల దక్షిణం వైపు పెట్టి పడుకోవాలి. నైరుతి మూలలోనే బీరువా పెట్టడం వలన పూర్తి నైరుతి మూలకు మంచాలు వేసుకునేందుకు ఒక్కోసారి వీలుపడదు. అందుకని మంచాలను అటు ఇటుగా సర్దుకుంటారు. అప్పుడు మంచాలకు మూడు వైపులా ఎంతో కొంత ఖాళీ స్థలం ఏర్పడుతుంది. మంచాలు దక్షిణ గోడకు ఆనుకుని వున్నట్లయితే మంచాలకు తూర్పున ఏర్పడ్డ ఖాళీ స్థలం కంటే పశ్చిమాన ఏర్పడ్డ ఖాళీ స్థలం తక్కువ వుండేలా చూసుకోవాలి. ఒకవేళ మంచాలు పశ్చిమ గోడను ఆనుకొని వున్నట్లయితే మంచాలకు ఉత్తరాన ఏర్పడ్డ ఖాళీ స్థలం కంటే దక్షిణాన వున్న ఖాళీ స్థలం తక్కువ వుండేలా చూసుకోవాలి. ఖర్చులేని ఇలాంటి పనులు చేయడం సులభం కనుక ప్రయత్నించి చూడవచ్చు.



### పెద్దల పటాలు

ఇంట్లోకి ప్రవేశించగానే ఎదురుగా పెద్దల (చనిపోయినవారి) పటాలు కనిపించేలాగా పెడుతుంటారు. పెద్దల మీద ప్రేమ మంచిదేగానీ ఆ పటాలను మొదటి గదిలో కాక లోపలి గదుల్లో పెట్టుకోవడం సరైన పద్ధతి. ఇంట్లోకి ప్రవేశించగానే ఎదురుగా ఏదయినా దేవుని పటం కనిపించేలా గున ఏర్పాటు చేసుకోవాలి.

ఇంటి ద్వారాల పైన, ద్వారాలకు ఎదురుగా లక్ష్మీదేవి పటాన్ని పెట్టడం వల్ల లక్ష్మీ చలనం కనుక లక్ష్మీదేవి పటాన్ని సాధ్యమయినంత వరకు పూజామందిరాల వరకు మాత్రమే పరిమితం చేసుకోవాలి.

కొంత మంది ఇళ్లల్లో పూజా మంది రాల్లోనే పెద్దల ఫొటోలు పెట్టి పూజ చేస్తుంటారు. ఇది కూడా సరైన పద్ధతి కాదు. ఆ ఫొటోలను లోపలి గదుల్లో తూర్పు లేదా ఉత్తరపు గోడలకు అమ ర్చుకోవడం తప్పనిసరి. ఇళ్లల్లో దుప్పి కొమ్ములు, పులి తల మొదలయిన అలంకార ప్రాయంగా అమర్చుకోవడం వాళ్ల అలంకార పిపాసను తెలుపుతుం దేమో కానీ వాళ్ల కుటుంబం మీద బాధ్యతారాహిత్యాన్ని కూడా తెలుపు తుంది. జంతువుల కొమ్ములు, తలలు మొదలయినవి ఇంట్లో పెట్టుకోకూడదు. జింకచర్మం లాంటివి కూడా పూజా సమయంలో ఆసనానికి మాత్రమే ఉపయోగించాలి. కానీ గోడల మీద అలంకారం కోసం కాదు.

### సీలింగ్ డిజైన్స్

సీలింగ్ డిజైన్స్‌లో సీలింగ్ నుండి కిందకి ఒక అంగుళం మేర బొడిపెలు గానీ, సూదుల్లాగానీ పొడుచుకువచ్చేలా సీలింగ్ అలంకరించడం ఆ ఇంట్లో నివసించేవాళ్లను మానసిక ఆందోళన కు గురి చేస్తుందనడంలో సందేహం లేదు. సీలింగ్ నున్నగా వుండాలి.

### బెడ్ రూమ్ లైట్లు

బెడ్‌రూమ్ లైట్ల విషయంలో కూడా ఒక జాగ్రత్త వహించడం మంచిది. ఎరుపు రంగు బెడ్ లైట్ సర్వదా శ్రేయస్కరం. నీలం, పసుపు, ఆకుపచ్చ రంగు వెలుతురు అందరి ఆరోగ్యానికి సరిప దేవి కాదు. సరిపడని వెలుతురులో పడుకోవడం వల్ల చెడు స్వప్నాలు రావడం, చర్మం పొడారిపోయినట్లు కనిపించడం మనిషి బరువు కోల్పోతూ అనారోగ్యం పాలవడం, మానసిక ఒత్తిడులకు గురికావడం జరుగుతూ ఉంటుంది. అందుకని ఏరంగు వెలుతురు సరిపోతుందో గమనించుకొని అదే వాడాలి. లేదా మిల్కీ బల్బ్ వాడుకోవచ్చు. ◆

# మనసున్న మనిషి

నరెద్దుల రాజారెడ్డి

ఉదయం ఆరింటికి నోట్లో బ్రష్ వేసుకుని చెరువుగట్టుపై కూర్చున్నాను. ఆలోచనలన్నీ మంజుల వైపే వెళుతున్నాయి. అమ్మాయి చాలా మంచిది. సున్నితమైన స్వభావం కలది. కానీ విధి ఆమె పాలిట శాపమైంది. చిన్నప్పుడే నాన్న చని పోయాడు. వాళ్ల అమ్మ కూలి పని చేసి చదివిస్తోంది. మంజుల గురించి తలచుకొంటుంటేనే కళ్లల్లో నీళ్ల తిరుగుతున్నాయి. "ఎవరైనా ఆర్థికపరంగా వుండీ, మంచి మనసున్నతన్ని పెళ్లి చేసుకుంటాను. ఇప్పుడెలాగూ సుఖం లేదు కనీసం పెళ్లయ్యాకైనా సుఖంగా వుండాలి కదా" అని మంజుల అంటుంటే నాలో అంతర్మధనం మొదలైంది.

తనది, నాది వేరే వేరే గ్రామాలైనా నా గురించి ఆమె కన్నా ఆమె గురించి నాకే బాగా తెలుసు. ఎప్పట్నుంచో తనని మనసులో ప్రేమిస్తున్నాను అడిగినవన్నీ తీయిస్తున్నాను. మంజుల కూడా నా పైన అపారమైన నమ్మకం పెంచుకుంది. తనను వదిలి వుండలేని పరిస్థితి నాలో ఎక్కువైంది. కానీ మంజులకు ఆర్థికపరమైన చేయూతనివ్వాలి. చేతనైనంత సహాయం అందించాలి. ఇలా ఆలోచించేలోగానే పొద్దు బారెడెక్కింది

"అయ్యో! సమయం దాటిపోతోంది. ఈరోజు మంజుల జన్మదినం తనకు కొత్తబట్టలు కొనాలి, షాపింగ్ చేయాలి" అని మనసులో అనుకుంటూ లేచి చక చకా ఇంటికి వెళ్లాను.

నాన్న మంచంపై కూర్చుని కాఫీ తాగుతున్నాడు "ఎక్కడికెళ్లావురా ఇంత సేపు నీ కోసం ఆ శివగాడు వచ్చి వెళ్లా డు" అని నాన్న అనగానే నా గుండెలో రైళ్ల పరిగెత్తాయి. ఆ పూట భోజనం కూడా చేయలేదు. డ్రెస్ మార్చుకుని బజార్లోకి అడుగు పెట్టాను. ఎట్టకేలకు మంజులకు కావలసిన బట్టలు వగైరా సరుకులు తీసుకుని వాళ్ళింటికెళ్లాను. నన్ను చూడగానే మంజుల ముఖంలో మెరుపు కళ కొట్టొచ్చినట్టు కనిపించింది. "నిజంగా నువ్వేగనక లేకపోతే నేను ఈ సెలబ్రేషన్ జరుపుకునేదాన్ని కాను. అప్పటికి నీ ఫ్రెండ్ రాకేష్ నన్ను బతిమాలాడాడు పుట్టినరోజు కానుకగా ఏదైనా తీయిస్తానని ఎలాగో నువ్వు తెస్తావు కదాని వద్దులే అన్నాను" అంది మంజుల. అంతే నాలో భయం నీడలా కమ్మేసింది.

ఆ రాకేష్ మంజులను లోలోపల చాలా ఇష్టపడుతున్న సంగతి తెలుసు. ఆమె ఆర్థిక పరిస్థితిని ఆసరా చేసుకొని ఎలాగైనా ఉడతాభక్తిగా సాయం చేసి మార్కులు కొట్టేయాలని వాడి ఆలోచన. అతను బాగా సంపన్నుడు. దేన్నయినా డబ్బుతో సాధించవచ్చనే మోసపూరితమైనా ఆలోచన గలవాడు. మంజుల వాడి పేరు ఎత్తగానే క్షణం నా గుండె చల్లబడింది"



అలాంటి వాళ్లను నమ్మొద్దు, ఏమిచ్చినా తీసుకోవద్దు" అన్నాడు.

"సరే" అంది.. మంజుల ఆరోజు పుట్టినరోజు వేడుకలు సంతోషంగా ముగిసాయి.

...

కాలానుగుణంగా జరిగే పరిణామాల పట్ల చాలా జాగ్రత్తగా వుండాలని మంజులకు చాలా సార్లు చెప్పాను. ప్రేమంటే బాధ్యత, ప్రేమంటే నమ్మకం. ఈ రెండు వదిలేసి అమ్మాయి వీక్‌నెస్‌ను ఆసరా చేసుకుని డబ్బు ఎర వేసి మోసం చేస్తున్నారు. అలా మోసగింప బడకూడదనే మంజులకు కావాల్సినవన్నీ నేనే సమకూర్చుతూ వస్తున్నాను.

ఇలా రోజులు గడుస్తుండగా ఒకరోజు తనని అర్జెంటుగా కలవాలని మెసేజ్ పంపింది. ఆరోజు సెలవు కావడంతో ఊరికి దూరంగా ఉన్న స్కూల్ గ్రౌండ్‌లో తన ఫ్రెండ్ శిరీషతో కలిసి వచ్చింది. చేతిలో చిన్న బాక్స్ ఆమె ముఖంలో ఏదో ఇబ్బందికరమైన తేడా కనిపించింది. బాక్స్ ఓపెన్ చేసి బంగారు ఉంగరాన్ని బయటికి తీసింది.


దాన్ని ఎక్కడో చూసినట్టు గుర్తు. ఆలోచన నుంచి తేరుకునేలోగానే అందులో నుండి ఒక చీటి బయటికి తీసి చూపించింది. విషయం అర్థమైపోయింది నాకు. ఆశ్చర్యం నుంచి కోలుకునేలోగానే–


"దీన్ని బంగారు షాపులో కుదువ పెట్టాల్సిన అవసరం ఏమిచ్చింది?" అని నిలదీసినట్టు అడిగేసరికి నేను నోరు మెదపలేకపోయాను. నా ఫ్రెండ్ ద్వారా విషయం తెలుసుకుందట. నిజంగా నేను కూడా మధ్య తరగతివాణ్ణే. ఆర్థికపరంగా మంజులను ఆదుకోకపోతే ఎక్కడ దూరమైపోతుందోనన్న భయంతో అప్పు చేసి ఇచ్చేవాణ్ణి. తనకు బట్టలు కావాలంటే చేతిలో చిల్లిగవ్వ లేని పక్షంలో దాన్ని కుదువకు పెట్టాల్సి వచ్చింది. తను ఊరెళ్లాలని చెప్పిన తక్షణం స్నేహితుడు శివగాడితో అప్పుగా నగదు తీసుకుని మంజులకు ఇచ్చాను. అన్ని విషయాలు చెప్పేపాటికి మంజుల అవాక్కైంది.


"ఎంత పని చేసావు రాజా! నేనెక్కడ నీ నుండి దూరం అవుతానోనని నీ పేదరికాన్ని దాచిపెట్టి అప్పు చేసి నన్ను సంతోషపరిచావా? అడిగిన వెంటనే డబ్బు ఇస్తుంటే నువ్వు ఆర్థికంగా బాగున్నావని అనుకున్నాను. ప్రేమంటే అవసరం కాదు రాజా.. ప్రేమంటే బాధ్యత, నమ్మకం. ఇవి రెండూ పుష్కలంగా నీలో వున్నాయి. మధ్యలో ఇవన్నీ ఎందుకు? నా కోసం ఎంత రిస్క్ పడ్డావో తెలుసా? అయినా ఆర్థికంగా సహాయం చేసినంత మాత్రాన వాళ్లకు ప్రేమను పంచుతావని ఎలా అనుకున్నావు.

సహాయం వేరు, ప్రేమ వేరు. నువ్వు నా కోసం అసలు నిజాన్ని దాచి మానసికంగా బాధను భరించి నన్ను సంతోషపెట్టావు. నాక్కావలసింది నీలాంటి మనసున్న మనిషి. కానీ మనసును లెక్కగట్టే మనిషి కాదు" అంటూ నన్ను గాఢంగా కౌగిలించుకుని ఆనందభాష్పాలు రాలుస్తున్న మంజులను చూస్తుంటే నా కళ్లల్లో నీళ్ల అప్రయత్నంగా రాలిపోయాయి. ❑

# ఈ వారం కా‘ర్టూన్స్’


... స్కూలూ లేదు.. హోం వర్కూ లేదు.. గత జన్మలో ఏమి పుణ్యం చేసుకుని కుక్క పిల్లగా పుట్టావురా..?!
Zakir...


..ఓకే.. ఓకే.. సోఫాలో నువ్వు ఒక గంట.. నేను ఒక గంట .. సరేనా..?!


..మీకేంటి సార్..? నా లాంటి ఉత్తమ బిచ్చగాడికి ధర్మం చేసి బోలెడంత పుణ్యం మూటగట్టుకున్నారు...!!
Zakir...



# ఫోటో ఫీచర్





ఇందులో
పెద్ద వింతేముంది?
ఏదో షాపింగ్‌లోని చిత్రాలే కదా అనుకోకండి. అలలపై తేలియాడే వెనిస్ నగరం పర్యాటకుల ఫేవరైట్ ప్లేస్. వెనిస్ నగరాన్ని తలపించే 'విలేజియో షాపింగ్ మాల్'ని కతార్ రాజధాని దోహాలో నిర్మించారు. ఎంచక్కా ఇక్కడి కాలువల్లో బోటింగ్ కూడా చేయవచ్చు.

